ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 30 నవంబరు 2025 | 5

అవకతవకలపై విచారణకు ఆదేశం

కొవ్వూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మునిసిపాలిటీలో 2015-16 అవకతవకల ఆరోపణలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. నాటి కమిషనర్ టీ.నాగేంద్రకుమార్,మేనేజర్ బి.శ్రీధర్ (రిటైర్డ్), ఆర్‌వొ పి.సాయిబాబు(రిటైర్డ్), జూనియర్ అసిస్టెంట్లు యూవీ నూకాంబిక, మీసాల హరనాథ్‌పై విచారణకు ఆదేశిస్తూ సీఎస్ ఎస్.సురేష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.15 రోజుల్లో రాతపూర్వకంగా సమాధానం అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వజ్రోత్సవ వేడుకల స్థూపం ఆవిష్కరణ

నిడదవోలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వజ్రోత్సవ వేడుకల స్థూపం పురపాలకసంఘం 60 ఏళ్ల చరిత్రకు నిదర్శనంగా నిలుస్తుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మునిసిపల్ కార్యాలయంలో శనివారం సాయంత్రం వజ్రోత్సవ వేడుకల స్థూపం ఆవిష్కరించి మాట్లాడారు. మునిసిపల్ అధికార్లు, ప్రజాప్రతినిదులు సమన్వయంతో వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయడం ఆనందదాయకం అన్నారు. కూటమి ప్రభుత్వం స్పెషల్ గ్రేడ్ మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయడం నిడదవోలు పురపాలక సంఘానికి ఇచ్చిన గిఫ్ట్ అన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ వజీరుద్దీన్, కమిషనర్ తోట కృష్ణవేణి, కౌన్సిలర్లు గోపిరెడ్డి శ్రీనివాస్, జాన్‌బాబు,గంగుల వెంకటలక్ష్మి, చిలకల శారదాదేవి పాల్గొన్నారు.


స్థూపం ఆవిష్కరణలో మంత్రి దుర్గేష్ చిత్రంలో చైర్మన్ ఆదినారాయణ తదితరులు


మాట్లాడుతున్న అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

రాష్ట్రం బాగుండాలనే శ్రీరుద్రయాగం

స్పీకర్ అయ్యన్నపాత్రుడు


అనపర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రం దుష్ట గ్రహాల బారిన పడకుండా ప్రజలంతా సంతోషంగా ఉండాలన్న ఆకాం క్షతో 41 రోజుల పాటు శ్రీరుద్రయాగం నిర్వహిస్తున్నామని స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. పెదపర్తిలోని పార్వతి రామలింగేశ్వర స్వామి ఆలయంలో అయ్యన్న పాత్రుడు ఆధ్వర్యంలో 41 రోజుల పాటు శ్రీరుద్ర యాగంతో పాటుగా పలు యాగాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం ఆయన స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. యాగ కార్యక్రమాలు చివరి దశకు చేరుకుంటున్న నేపథ్యంలో మరోసారి స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చానన్నారు. బ్రహ్మశ్రీ యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య ఆధ్వర్యంలో యాగ కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయన్నారు. అనం తరం ఆలయ అర్చకులు స్పీకర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

లెక్కకు..చిక్కేనా!

పులుల జాడెక్కడ

- అభయారణ్యంలో రేపటి నుంచే గణన
- 3 రోజులు అడవిలో అడుగుజాడల గుర్తింపు
- 2022లో 6 చిరుతలు, 4 పెద్దపులులు





(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అడవుల్లో పులుల లెక్కింపునకు రంగం సిద్ధమైంది. పాపికొండల అభయారణ్యం, కాకినాడ, ఏలేశ్వరం అటవీ డివిజన్లలో వీటి సంఖ్య లెక్కించేందుకు సోమవారం నుంచి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.తొలి మూడు రోజులు రోజుకు ఐదు కిలోమీటర్ల పాటు అడవుల్లో తిరిగి వీటి అడుగులు,ఇతర గుర్తులు సేకరించనున్నారు. ఆ తర్వాత ట్రాన్సెక్ట్ లైన్ ఏర్పాటు చేసి దాని వెం బడి 280కిపైగా ట్రాప్ కెమెరాలు బిగించి పులులను లెక్కించనున్నారు. 2022లో నిర్వహించిన సర్వేలో పాపికొండల్లో ఆరు చిరుతలు, నాలుగు పెద్ద పులులు గుర్తించారు.ట్రాప్ కెమెరాకు చిక్కని పులులు ఎక్కువగానే ఉండొచ్చని తేల్చారు.గతేడాది సెప్టెంబరులో పాపికొండల నుంచి పు లులు దారితప్పి రాజమహేంద్రవరం పుష్కరవనం, ప్రత్తిపాడులో సంచరించి బెంబేలెత్తించాయి.

నాలుగేళ్లకు ఒకసారి..



పాపికొండల అభయారణ్యంతో పాటు కాకినాడ, ఏలేశ్వరం, రంపచోడవరం అటవీ డివి జన్లలో పులులు, చిరుతలు ఎన్ని ఉన్నాయనే దానిపై అటవీ శాఖ నాలుగేళ్లకోసారి పులుల లెక్కింపు చేపడుతోంది. చివరిగా పాపికొండల్లో 2022లో పులుల లెక్కింపు జరిగింది. ఉమ్మడి తూర్పు, ఉమ్మడి పశ్చిమ జిల్లాల్లోని అభ యార ణ్యంలో రెండు దశల్లో చెరో 45 రోజులు 116 ప్రాంతాల్లో 232 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి సంఖ్య లెక్కించారు.అందులో భాగంగా నాలుగు పెద్దపులులు, ఆరు చిరుతలు ఉన్నట్టు తేల్చారు. ట్రాప్ కెమెరాకు చిక్కని చిరుత పులులు మరో పది వరకు ఉండొచ్చని అంచనా వేశారు. రంపచోడవరం,మారేడుమిల్లి అడవుల్లో పులుల కంటే చిరుతల సంచారం అధికంగా ఉందని నిర్ధారిం చారు.2018లో నిర్వహించిన సర్వేలో ట్రాప్ కెమె రాలకు పులులు,చిరుతలు చిక్కలేదు. దీంతో ఆ ఏడాది సర్వే వివరాలను బయట పెట్టలేదు.

పులుల ఆవాసం అక్కడే..

పులులు, చిరుత పులులకు పాపికొండల అభయారణ్యం పెట్టింది పేరు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, అల్లూరి జిల్లా ఏజెన్సీ కలిపి మొత్తం 2.6 లక్షల ఎకరాల్లో పాపికొండలు విస్తరించి ఉన్నాయి. మొత్తం 391 చదరపు మైళ్ల విస్తీర్ణంలో ఉన్న పాపికొండల మధ్యలో గోదావరి ఉంది. అందుకే పులుల ఆవాసానికి పాపికొండలు ప్రసిద్ధి. ఈ పులులు గోదావరికి అటూ ఇటూ తిరుగుతుంటాయి. దట్టమైన అటవీప్రాంతం కావడంతో అనేకరకాల పక్షులు,జంతువులు సైతం సంచరిస్తుంటాయి.ఆహారం,నీటికి పులులకు పాపికొండల్లో ఢోకా ఉండదు.దీంతో పాపికొండల అభయా రణ్యంలో పులుల సంచారం అధికం.ఇంత అనుకూల వాతావరణం ఉండడంతో ఏటా వీటి సంతానం వృద్ధి చెందుతోంది.

పులుల సర్వే చేస్తారిలా..

సర్వేలో పులులు,చిరుతల లెక్క పక్కాగా తేల్చడానికి అటవీ శాఖ నాగార్జున సాగర్- శ్రీశైలం టైగర్ రిజర్వు (ఎన్ఎస్‌టీఆర్), వైల్డ్‌లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూ ఐఐ) నిపుణులతో కలిసి పనిచేయనుంది.ఫిబ్రవరి మొదటి వారానికి పులులు, చిరుతల సంఖ్య తేలనుంది. ఈ దఫా పులుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో ఉన్న నాలుగు పెద్దపులులు, ఆరు చిరుతలు రెట్టింపునకు పైగా ఉండొచ్చని భావిస్తున్నారు. ప్రధానంగా గడచిన కొన్నేళ్లలో వీటి సంతానం బాగా వృద్ధి చెంది ఉంటుందని విశ్లేషిస్తున్నారు. పైగా గతేడాది పాపికొండల నుంచి దారితప్పి పులులు బయటకు వచ్చిన సంఘటనలను విశ్లేషిస్తున్నారు.

280 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు

20 బీట్ల పరిధిలో పులుల లెక్కింపునకు అధికారులు ఏర్పాట్లు చేశారు. తొలి మూడు రోజుల పాటు అభయారణ్యం, అటవీ డివిజన్లలో ఒక్కో రూట్‌లో రోజుకు ఐదు కిలోమీటర్ల చొప్పున అటవీ సిబ్బంది అడవిలో తిరగనున్నారు. పులులు, చిరుతలు,ఇతర మాంసాహార జంతువుల పాద ముద్రలు, ఇతర గుర్తులు సేకరిస్తారు.ఈ వివరాలను ఎం-స్ట్రైప్స్ యాప్‌లో నమోదు చేస్తారు. డిసెంబరు 6 నుంచి 8 వరకు అభయారణ్యంలో ట్రాన్సెక్ట్ లైన్ సిద్ధం చేస్తారు. నెలాఖరుకు గుర్తించిన ప్రాంతాల్లో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. పాపికొండల అభయారణ్యం పరిధిలో, 220, కాకినాడ,ఏలేశ్వరం డివిజన్లలో 60 కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.

రంపచోడవరాన వాయిదా

గతేడాది సెప్టెంబరులో రాజమహేంద్రవరం నగరంలోకి చిరుత దారి తప్పి వచ్చింది. పాపికొండల అభయారణ్యం విస్తరించిన వీఆర్‌పురం, రంపచోడవరం, మారేడుమిల్లి, గోక వరం మీదుగా చిరుత రాజమ హేంద్రవరంలోకి దారి తప్పి వచ్చి ఉండొచ్చని భావించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి పోలవరం ప్రాజెక్టు మీదుగా రంప ఏజెన్సీ వరకు విస్తరించి ఉన్న పాపికొండల అభయారణ్యంలో పులుల సంచారం బాగా పెరిగిందని అటవీశాఖ అంచనా వేస్తోంది. రంపచోడవరం అటవీ డివిజన్ పరిధిలో ఇటీవల మావోల సంచారం నేపథ్యంలో తాత్కాలికంగా ఇక్కడ పులుల గణన వాయిదా వేసినట్టు అటవీశాఖ తెలిపింది.


ఎంపీ పురందేశ్వరిని సత్కరిస్తున్న మహిళలు చిత్రంలో ఎమ్మెల్యే నల్లమిల్లి, ఎమ్మెల్సీ సోము

మహిళలు ఆత్మ నిర్భరత సాధించాలి

ఎంపీ పురందేశ్వరి

అనపర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆత్మ నిర్భరత సాధించినపుడే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని అందుకే ప్రధాని మోడీ ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమాన్ని రూపొందించారని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. అనపర్తి మండలం రామవరంలోని ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన ఆత్మ నిర్భర్ భారత్ సంకల్ప అభియాన్ మహిళా సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. కేంద్ర పథకాలు మహిళలకు పూర్తి స్థాయిలో చేరాలన్న సంకల్పమే ఆత్మ నిర్భర్ లక్ష్యమన్నారు. మహిళలు బలపడితే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మూలమని.. తద్వారా మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ స్వదేశీ వస్తువులు కొనడం ద్వారా దేశ ఆర్థిక పరిస్థితి బలపడుతుందన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధికి కేంద్రం అనేక పథకాలు రూపొందించిందన్నారు. డ్వాక్రా మహిళలకు రూ.2 లక్షల రుణం నుంచి రూ.20లక్షల రుణం వరకు పెంచిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు.అనంతరం ఎంపీ పురందేశ్వరిని గజమాల, దుశ్శాలువాతో ఎమ్మెల్యే నల్లమిల్లి ఆధ్వర్యంలో కూటమి మహిళలు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కళ్యాణ చక్రవర్తి, హారిక, ఏఎంసీ ఛైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లిడి సురేంద్రరెడ్డి, జిల్లా కార్యదర్శి హేమతులసి, నియోజకవర్గ మండలాల బీజేపీ అధ్యక్షులు,నాయకులు పాల్గొన్నారు.

డిసెంబరు 5న పేరెంట్ టీచర్స్ మీట్

రాజమహేంద్రవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిసెంబరు 5న 956 ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే మెగా పేరెంట్ టీచర్ మీటింగ్(పీటీఎం)కి ఘనంగా ఏర్పాటు చేస్తున్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు. కలెక్టర్ కీర్తి చేకూరితో శనివారం సమీక్షించారు. జిల్లాలో 93,399 మంది విద్యార్థులు, 2 లక్షల మందికిపైగా తల్లిదం డ్రులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి ప్రత్యేక కార్యక్రమం ఉంటుంద న్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, విద్యార్థుల వ్యక్తిగత వికాసం, తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంపు లక్ష్యంగా పీటీఎం ఉంటుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆ రోజున ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ, తరగతి ఉపాధ్యాయులతో చర్చలు, విద్యార్థులకు క్రీడా కిట్లు, సైన్స్ ప్రాజెక్టులు, ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ మేఘ స్వరూప్, ఎమ్మెల్సీ రాజశేఖర్, ఎమ్మెల్యే ముప్పిడి పాల్గొన్నారు.

పుష్కరాలకు సన్నద్ధం కండి

- 7 కోట్ల మంది భక్తుల అంచనా
- 2015లో 5 కోట్ల మంది రాక
- 2027లో మరింత పెరిగే ఛాన్స్
- శాఖల మధ్య సమన్వయం కీలకం
- ప్రతిపాదనలు చేయాలని ఆదేశం
- అధికారులతో మంత్రి సమీక్ష



పుష్కరాలపై సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్ చిత్రంలో ఎంపీ పురందేశ్వరి, కలెక్టర్ కీర్తి చేకూరి,ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, ముప్పిడి వెంకటేశ్వరరావు, నల్లమిల్లి తదితరులు

రాజమహేంద్రవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాబోయే పుష్కరాలకు 7 కోట్ల నుంచి 8 కోట్ల మంది భక్తులు వస్తారనే అంచనా ఉందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.స్థానిక కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ కీర్తి చేకూరి అధ్యక్షతన ప్రజాప్రతినిధులు, సమన్వయ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాబోయే పుష్కరాలు ఒక శుభారంభం.. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసేలా పుష్కరాలకు భారీ స్థాయిలో సన్నద్ధమవుతున్నామని చెప్పారు. శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని.. ఇప్పటికే అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, అంచనాలతో ముందుకు వచ్చారన్నారు. పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారి వీర పాండ్యన్‌ను స్పెషల్ ఆఫీసర్‌గా నియమించిందని, కేబినెట్ సబ్-కమిటీని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈసారి పుష్కరాలకు సమర్థవంతమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని రవాణా, మౌలిక సదుపాయాల బలోపేతంపై దృష్టి సారిస్తున్నామన్నారు. అఖండగోదావరి ప్రాజెక్టును పుష్కరాల నాటికి పూర్తిచేస్తామన్నారు. జిల్లాలో ప్రజాప్రతినిధుల నుంచి సంబంధిత ప్రాంతాల పనుల వివరాలు సేకరించి, వాటిని ప్రతిపాదనల్లో చేర్చాలని సూచించారు. రద్దీని ఎదుర్కొనడానికి నిడదవోలు రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయాల్సి ఉందని చెప్పారు. ప్రత్యేక రైళ్లకు హాల్ట్ కల్పించాలని రైల్వే అధికారులకు సూచించారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ 2015 గోదావరి పుష్కరాలకు దాదాపు 5 కోట్ల మంది భక్తులు రాగా ఈసారి 7 కోట్ల నుంచి 8 కోట్ల మంది వరకూ రావొచ్చనే అంచనా ఉందని తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. శాఖలవారీ అంచనా నివేదికలు సిద్ధమైన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి పంపి అవసరమైన నిధులు పొందడానికి కృషిచేస్తామని చెప్పారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఘాట్ల అభివృద్ధి, రద్దీ నిర్వహణ, తాత్కాలిక సదుపాయాల ఏర్పాటు వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ 2015 నాటి పుష్కరాల నివేదికల ఆధారంగా 2027 పుష్కరాలకు అవసరమైన ప్రతిపాదనలు హేతుబద్ధంగా సిద్ధం చేశారన్నారు. విభాగాల వారీగా ప్రతిపాదనలు, అంచనా ఖర్చులు ఫేజ్-1,ఫేజ్-2 ప్రణాళికలను వెంటనే సమర్పించాలని సూచించారు. భక్తులకు ఎటువంటి ఆటంకం లేకుండా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, పార్కింగ్ వ్యవస్థ ఉండాలన్నారు. రాజమహేంద్రవరం కమిషనర్ రాహుల్ మీనా 2015 పుష్కరాల్లో చేపట్టిన చర్యలు, ఈసారి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమగ్ర పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. సమావేశంలో జేసీ వై.మేఘాస్వరూప్, డీఆర్‌వో టి.సీతారామ మూర్తి, అదనపు ఎస్పీ మురళీకృష్ణ, ఆర్డీవోలు రాణిసుస్మిత,ఆర్.కృష్ణనాయక్, జిల్లా అధికారులు కె.గోపినాథ్, ఎస్ఈ తిలక్ కుమార్ జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సూచనలు

రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీని వాస్ మాట్లాడుతూ రియల్ టైమ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అమలు చేయాలన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రా సుగర్స్, ఏపీ పేపరు మిల్లు కాలుష్య నియంత్రణ చర్యలు వేగవంతం చేయాలని చెప్పారు.కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొవ్వూరు స్టేషన్‌లో ప్రధాన రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ఘాట్లు, రహదారులు, మంచినీటి సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ శానిటేషన్ సిబ్బందికి గౌరవభత్యం ఇవ్వాలని, మురుగనీటి పారుదల వ్యవస్థను సజావుగా నిర్వహించాలన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల్లో చేపట్టాల్సిన పనుల నుసమగ్రంగా ప్రతిపాదించాలన్నారు. పుష్కరాల నాటికి సన్నద్ధం కావాలన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో అంతా ఆన్‌లైన్ | 12 మంది చోరులు చిక్కారు | యానాంలో గుట్కా పట్టివేత 7

పోషకాలను.. అమ్మేస్తున్నారు!



రేషన్ బియ్యం..తింటే ఆరోగ్యం

- ఎన్నెన్నో పోషకాలు
- ప్రత్యేకంగా సర్కారు తయారీ
- ప్రాసెసింగ్‌కే కేజీ రూ.50
- రూ.20కే అమ్మేస్తున్న వైనం
- నేటికీ పక్కదారి పడుతున్న రైస్

రాజమహేంద్రవరానికి చెందిన సత్యనారాయణకు సుగర్ వ్యాధి ఉంది.. పరీక్షిస్తే 400 పైనే ఉంటుంది. దీంతో భయపడిన అతను ప్రతి రోజూ పరీక్ష చేయించుకున్నా తగ్గేది కాదు.. డాక్టర్‌ను సంప్రదిస్తే.. బియ్యం మార్చాలని సూచించాడు. ఏం చేద్దామా అని ఎక్కడో విని రేషన్ బియ్యం వాడకం ఆరంభించాడు.. అంతే సుగర్ అమాంతం తగ్గింది.. నాటి నుంచి రేషన్ బియ్యమే వాడుతున్నాడు..

కొవ్వూరుకు చెందిన సత్యవతి.. గతంలో రేషన్ బియ్యం విక్రయించేసి సన్నబియ్యం కొనుగోలు చేసుకుంటుంది. అవే తింటుంది.. ఇటీవల రేషన్ బియ్యంలో పోషకాలు ఎక్కువని చెప్పడంతో ప్రస్తుతం రేషన్ బియ్యమే వినియోగిస్తుంది.. రేషన్ బియ్యం వాడిన తరువాత నీరసం తగ్గిందని చెప్పడం గమనార్హం.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రేషన్ బియ్యంలో ఉన్న పోషక విలువలపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో ఇష్టానుసారం విక్రయించేస్తున్నారు. జిల్లాలో 5.63 లక్షల మంది రేషన్ కార్డుదారులు ఉండగా నెలకు సుమారు 8 వేల టన్నుల బియ్యాన్ని అందిస్తున్నారు. ఇందులో సగానికి పైగా బ్లాక్ మార్కె ట్‌కి తరలిపోతున్నాయి.పేదల బియ్యం విక్రయించడం నేరమైనా రేషన్ డీలర్లు ఆ వక్ర మార్గాన్ని వీడడం లేదు. విజిలెన్స్‌లో సిబ్బంది కొరత అక్రమార్కులకు వరంగా మారింది.ఇప్పుడు ప్రభుత్వం అక్కడికక్కడే పరీక్షించే విధంగా టెస్టింగ్ కిట్లు పంపింది.ఇవి ఎంత వరకూ ఫలితాన్నిస్తాయో చూడాల్సిందే.

ఎన్నెన్నో ఆరోగ్య పోషకాలు

గతంలో రేషన్ బియ్యం ముతగ్గా.. రాళ్లు, బెడ్డలతో ఉండేవి. అందువల్ల వాటిని తినడానికి ఇష్టపడేవాళ్లు కాదు. కానీ ఇప్పుడు ప్రభుత్వం నాణ్యమైన బియ్యాన్ని ఇస్తోంది. వీటిని లబ్ధిదారులకు ఉచితంగా ఇవ్వడానికి ప్రభుత్వం కిలోకి రూ.46 భరిస్తోంది. అంటే కిలో రేషన్ బియ్యం రవాణా, నిర్వహణ చార్జీలతో కలిపి రూ.50 అవుతుంది.బియ్యంలో నూక, రాళ్ల వంటి వాటిని నివారించడానికి సార్టెక్స్ మిషన్లను వాడుతోంది. దీంతో గతంలో 25 శాతం నూక ఉంటే ఇప్పుడు 15 శాతం, పాడైన, రంగు మారిన బియ్యం 3 శాతం నుంచి 1.5 శాతానికి పరిమితమయ్యాయి.ఆరోగ్యపరంగా మేలు చేయడానికి మైక్రో న్యూట్రియంట్స్ కలిగిన కెర్నెల్స్‌ని కలుపుతున్నారు.రేషన్ బియ్యంలో బాగా తెల్లగా కనబడేవి ఇవే. పిల్లలు, మహిళ ల్లో రక్తహీనతకు చెక్ పెట్టడానికి ఐరన్, నరాలు, మెదడు చురుగ్గా పనిచేయడానికి, రక్తం తయారు కావడానికి విటమిన్ బి 12, మహిళల ఆరోగ్యానికి ఫోలిక్ యాసిడ్ వంటి వాటితో కూడినవి ఈ కెర్నెల్స్. వీటిని ప్లాస్టిక్ బియ్యం అనే అపోహలో జనం ఉండిపోయారు.వీటిపై అవగాహన కల్పించడంలో ఆ శాఖలు విఫలమవుతున్నాయి. దీంతో రేషన్ బియ్యం కిలో రూ.20లకు దుకాణం వద్ద విక్రయించేసి సొమ్ము చేసుకుంటున్నారు.ఎంత లాస్ అన్నది ఆలోచించడంలేదు.

189 కేసులు..49 టన్నుల రైస్ సీజ్

వైసీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనాలు రేషన్ బియ్యం అవినీతికి కేంద్ర బిందువులుగా మారడంతో కూటమి ప్రభుత్వం ఆ వాహనాలను తొలగించింది. కూటమి ప్రభుత్వం పేదల బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే దిశగా ర్యాపిడ్ కిట్‌లను రంగంలోకి దింపింది. ఈ కిట్లలో పొటాషియం థయోసైనైడ్, హైడ్రోక్లోరిక్ యాసిడ్ సీసాలు ఉంటాయి. ఈ ద్రావణాలను బియ్యంపై స్ప్రే చేస్తే.. ఒకవేళ రేషన్ బియ్యం ఉంటే ఎరుపు రంగులోకి మారిపోతాయి. జిల్లాలోని ఏడుగురు డీటీలు, ఇద్దరు ఏఎస్‌వోలకు వీటిని ఇచ్చారు. రేషన్ బియ్యం అక్రమాల విషయంలో తూర్పు గోదావరిలో ఈ ఏడాది ఇప్పటి వరకూ పౌర సరఫరాల శాఖ 106 కేసులు పెట్టి 31 టన్నుల బియ్యాన్ని సీజ్ చేసింది. విజిలెన్స్ 83 కేసులు పెట్టి 18 టన్నులు స్వాధీనం చేసుకొంది. విజిలెన్స్, రెవెన్యూ, పౌర సరఫరాలు, పోలీసులు రేషన్ బియ్యంపై తనిఖీలు తూతూమంత్రంగా చేయడంతో మూడుపువ్వులు ఆరు కాయలుగా రేషన్ బియ్యం అక్రమాలు సాగుతున్నాయి. రేషన్ షాపుల నుంచి బ్లాక్ మార్కెట్‌కి వెళుతున్నవి మళ్లీ పాలిష్ చేసి సన్నాలుగా బహిరంగ మార్కెట్‌లోకి వివిధ పేర్లతో ప్రత్యక్షమ వుతున్నాయి. వీటిని రూ.60కి జనం కొను గోలు చేస్తున్నారు.ఇక విదేశాలకు భారీ ఎత్తు న తరలిపోవడం వైసీపీ ప్రభుత్వ హయాం లో వ్యవస్థీకృతమైపోయింది.ఒక్క షిప్ గమ్యా నికి చేరితే కోట్లలో ఆదాయం సమకూరుతుంది.

ప్రపంచ కరెన్సీ అంతా ఇక్కడే..


ప్రపంచంలోని 65దేశాల కరెన్సీ నోట్లు, నాణేలు

- 65 దేశాల నోట్లు, నాణేల ప్రదర్శన
- 50 దేశాల పోస్టల్ స్టాంపులు, కవర్లు సేకరించి ప్రదర్శించిన పవర్‌ప్లాంటు ఉద్యోగి
- ఆసక్తికరంగా తిలకించిన విద్యార్థినులు

ప్రపంచంలోని పలు దేశాల కరెన్సీ అంతా ఒకేచోటకు చేరింది. అదే రీతిలో పోస్టల్‌కు వినియోగించే స్టాంపులు, కవర్లును ప్రదర్శించారు. ఒక పవర్‌ప్లాంటు ఉద్యోగి చిన్ననాటి ఆసక్తితో చేసిన ఈ సేకరణ అబ్బురపరిచేలా ఉంది. సేకరించడమేగాక వాటిని విద్యార్థులకు ప్రదర్శిస్తూ ఇటువంటి సేకరణలపై వారికి ఆసక్తి కలిగించే ప్రయత్నం చేశారు.

(గొల్లప్రోలు-ఆంధ్రజ్యోతి)

ఒకరి వద్ద ఆ దేశానికి సంబంధించిన అన్ని రకాల కరెన్సీ, నాణేలు అందుబాటులో ఉండవు. అటువంటి 65 దేశాలకు చెందిన కరెన్సీ, నాణేలును సేకరించాడు. ఇవే కాదు 50దేశాలకు చెందిన పోస్టల్ కవర్లు, స్టాంపులు సేకరించి భద్రపరిచి అందరికీ ప్రదర్శిస్తూ అవగాహన కల్పిస్తున్నారు పిఠాపురం పట్టణంలో నివాసముంటున్న ఏఎం చంద్రశేఖర్. తమిళనాడుకు చెందిన వీరి కుటుంబం తండ్రి పిఠాపురం షుగర్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేసే సమయంలో ఇక్కడ స్థిరపడింది. చంద్రశేఖర్ నెల్లూరులోని పవర్‌ప్లాంటులో మెకానికల్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. ఈయన చిన్నతనం నుంచి ఎవరైనా ఇచ్చిన నోట్లు, నాణేలు భద్రపరిచేవారు. తండ్రి ఉద్యోగరీత్యా వివిధ ప్రదేశాలకు వెళ్లిన భిన్నమైన కరెన్సీ చూసి వాటిని సేకరించేవారు. అన్నిదేశాల కరెన్సీ సేకరిస్తే బాగుంటుందని ఆసక్తితో సేకరించడం మొదలుపెట్టారు. 2006 నుంచి మొదలుపెట్టి 65 దేశాల కరెన్సీ నాణేలు సేకరించారు. కనీసం 150 దేశాల కరెన్సీ సేకరించే లక్ష్యంతో ఉన్నాడు. అదేవిధంగా 50దేశాల్లో వినియోగించే పోస్టల్ కవర్లు, స్టాంపులు సేకరించారు. మనదేశంలో 1962-67 మధ్యకాలంలో చలామణిలో ఉన్న నోట్లతోపాటు టిప్పు సుల్తాన్ కాలంలో చలామణిలో ఉన్న నాణేలు, స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి చలామణిలో ఉన్న నాణేలు సేకరించారు.


వివిధ దేశాల కరెన్సీ, నాణేలు, పోస్టల్‌స్టాంపులను తిలకిస్తున్న గొల్లప్రోలు జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు


టిప్పుసుల్తాన్ కాలం నాటి నాణేలు


1962-68 మధ్య చలామణీలో ఉన్న రూ. 10 నోటు

పాఠశాలల్లో ప్రదర్శన

కరెన్సీ రూపాంతరం చెందిన విధానం గురించి విద్యార్థులకు అవగాహనకల్పించాలనే లక్ష్యంతో పాఠశాలల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాడు. వివిధదేశాల కరెన్సీ, పోస్టల్ స్టాంపులు, కవర్లు గురించి వివరించడంతో పాటు తాను ఎలా సేకరించానో చెప్పడం ద్వారా వారిలోనూ దీనిపై ఆసక్తి కలిగించాలని ప్రయత్నిస్తున్నారు. గొల్లప్రోలు జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటుచేసిన ఈ ప్రదర్శనను విద్యార్థినులు ఆసక్తిగా తిలకించారు.


వివిధ దేశాల పోస్టల్ స్టాంప్లు, కవర్లు

చిన్ననాటి నుంచే ఆసక్తి కలిగింది

- ఏఎం చంద్రశేఖర్, పవర్‌ప్లాంటు ఉద్యోగి, పిఠాపురం



చిన్నతనంలో ఎవరైనా బంధువులు వచ్చినా, ఇతర ప్రాంతాలకు వెళ్లినా నాణేలు, కరెన్సీ నోట్లు ఇచ్చేవారు. పలువురు దగ్గర వివిధ రకాల కరెన్సీ నోట్లుచూసి వాటిని సేకరించాలనే ఆసక్తి కలిగింది. 2006 నుంచి ఇలా సేకరణ ప్రారంభించి 65 దేశాల కరెన్సీ, 50 దేశాల పోస్టల్ స్టాంపులు సేకరించాను. ఇప్పటికి ఎక్కడికి వెళ్లినా, ఇతర దేశాల్లో ఉన్న స్నేహితులతో మాట్లాడినా వారి వద్ద ఉన్న వైవిధ్యమైన కరెన్సీ కవర్లు గురించి అడుగుతాను. వాటిని ఇమ్మని అడిగి భద్రపరుస్తాను. ఉద్యోగం చేస్తున్న నేను సెలవులకు వచ్చినప్పుడు ప్రభు త్వ పాఠశాలల్లో ప్రదర్శనలు ఏర్పాటుచేసి వాటి ని విద్యార్థులకు చూపించి అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నాను. ఇది ఎంతో శ్రమ, వ్యయంతో కూడుకున్న పని అయినా అందులో ఉన్న సంతృప్తి ఇంకా కొనసాగించేలా చేస్తోంది.

పెట్రోలు లూజు అమ్మకాలు కాదండోయ్

- వీధికుక్కల బెడద నుంచి బయట పడేందుకు..
- ప్రతీ ఇంటి ముందు వేలాడుతున్న బాటిళ్లు




అమలాపురం కామాక్షీ పీఠం వీధిలో ఇంటి కిటికీలకు వేలాడుతున్న ఎరుపురంగు ఫుడ్‌కలర్ కలిసిన నీళ్ల బాటిళ్లు

అమలాపురంరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంలోని ప్రధాన వీధుల్లో పెట్రోలు లూజు అమ్మకాలు పెరిగిపోయాయా. జిల్లాలో ఎక్కడపడితే అక్కడ పెట్రోలు లూజు అమ్మకాలు విచ్చలవిడిగా జరిగిపోతున్నాయా. లూజు పెట్రోలు కోసం ఎందరో వాహనదారులు ఆయా ఇళ్ల వద్ద వాహనాలు ఆపి పెట్రోలు అడగడం నిజం కాదా. అవి పెట్రోలు లూజుకు అమ్మకాల బాటిళ్లు కాకపోతే మరేమిటి అని ఎవరికైనా సందేహం వస్తోంది. పెట్రోలు లూజు అమ్మకాల మాదిరిగానే ఇళ్ల ప్రహరీ గోడలపైనా కిటికీలకు వేలాడుతున్న ఆ ప్లాస్టిక్ బాటిళ్లు ఏమిటో తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగక మానదు. వీధి కుక్కల బెడద నుంచి బయట పడేందుకు ఇళ్ల యజమానులే కాదు వివిధ వ్యాపార సంస్థల ప్రతినిధులు ఈ తరహాలో ఎరుపురంగు ఫుడ్ కలర్ కలిపిన నీరున్న బాటిళ్లను వేలాడ దీస్తున్నారంటే కుక్కల బెడద ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదేదో అమలాపురం పట్టణానికి మాత్రమే పరిమితమనుకుంటే పొరపాటే. అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లి, పేరూరు, అంబాజీపేట, ఇలా ఎక్కడపడితే అక్కడ ఇళ్ల చుట్టూ ఎరుపురంగు నీళ్ల బాటిళ్లు రోడ్ల పక్కన దర్శనమిస్తున్నాయి.

దేశ అత్యున్నత న్యాయస్థానం కల్పించుకున్నా..

దేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్లో వీధి కుక్కల బెడద ఒకటి. అందుకే దేశ అత్యున్నత న్యాయస్థానం కల్పించుకుని మరీ ప్రత్యేక ఆదేశాలను జారీ చేసింది. కొవిడ్ సమయంలో వీధి కుక్కల సంఖ్య గణనీయంగా పెరిగినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీధికుక్కల బెడదను నియంత్రించేందుకు ప్రభుత్వపరంగా ఇప్పటికే ప్రాథమిక చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడంతోపాటు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేస్తున్నారు. కానీ ఈ పనులు మందకొడిగానే జరుగుతున్నాయి. రేబిస్ సోకిన కుక్కలతోపాటు దాడులకు తెగబడి ప్రమాదకరమైన కుక్కలను ప్రత్యేక షెల్టర్లకు తరలించాల్సి ఉంది. ఇందుకోసం ప్రభుత్వం సైతం ప్రత్యేక ఆదేశాలు ఇచ్చింది. అందుకు తగ్గ ఏర్పాట్లు ఎక్కడా చేపట్టలేదు. వీధి కుక్కల నియంత్రణ పట్టణాలకే పరిమితం కావడంతో గ్రామాల్లో పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. మరి వీటిని ఎప్పటికి నియంత్రించనున్నారు. అందుకేనేమో కుక్కల బెడద నుంచి బయటపడేందుకు ఎరుపురంగు కలిపిన నీరున్న ప్లాస్టిక్ బాటిళ్లను వేలాడదీయడం పల్లెసీమల నుంచే ప్రారంభమైంది. ఈ బాటిళ్లను వేలాడదీయడంవల్ల కుక్కల బెడద చాలా వరకు తగ్గిందని ఆయా ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు.

కుక్కలకు ఎరుపురంగు ఫోబియా ఉండవచ్చు

- డాక్టర్ ఎల్.వియారెడ్డి, అమలాపురం పశువసంవర్థకశాఖ సహాయ సంచాలకుడు



కుక్కల బెడద నుంచి బయట పడేందుకు ఎరుపురంగు కలిపిన నీరున్న బాటిళ్లు పలు ప్రాంతాల్లో చూస్తున్నాం. ఎరుపురంగు అంటే కుక్కలకు ఫోబియా ఉండొచ్చు. ఎందుకంటే మరీ ఏ ఇతర రంగు కలిపిన నీటిని ఎవరూ వాడడం లేదు. ఇది మూఢనమ్మకమని కొట్టి పారేయలేము. ఎరుపురంగు బాటిళ్లను చూసి కుక్కలు దరిదాపులకు రావడం లేదని ఇప్పటికే చాలామంది చెప్పారు.

డాక్టర్ అర్చనకు ఉత్తమ సేవా పురస్కారం



జీజీహెచ్(కాకినాడ), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గొల్లలమామిడాడరూరల్ హెల్త్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ శివకోటి అర్చనకు రాష్ట్రస్థాయి ఉత్తమ సేవా పురస్కారం వరించింది. 2017సెప్టెంబరు నుంచి 2025 జూన్ మధ్య కాకినాడ జీజీహెచ్‌లోని ఫ్యామిలీ ప్లానింగ్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నప్పుడు 3,918 మంది గర్భిణులకు ట్యూబెక్టమీ ఆపరేషన్‌లు చేశారు. వారిలో 75 మంది హెచ్‌ఐవీ గర్భిణులకు కూడా ట్యూబెక్టమీ శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఆమె అందించిన ఈ సేవలను ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీసాక్స్) గుర్తించి అవార్డును ప్రధానం చేయనుంది. డిసెంబరు 1వ తేదీన ఎయిడ్స్ డే సందర్భంగా డాక్టర్ అర్చన విజయవాడలో ఈ అవార్డ్‌ను అందుకోనున్నారు. ఈమెను ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి అభినందించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


స్వామివారి నిత్యాన్నదానికి రూ.లక్ష విరాళం అందిస్తున్న రుద్రరాజు గంగరాజు

అంతర్వేది, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం అనంతరం నిత్యాన్నదాన ట్రస్టుకు మలికిపురం మండలం లక్కవరానికి చెందిన రుద్రరాజు గంగరాజు సోదరి రుద్రరాజు సుభద్రాయమ్మ జ్ఞాపకార్థం రూ.లక్ష విరాళంగా అందించారు. విరాళ దాతకు ఆలయ ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

గ్రామాల్లో పీఎంపీ, ఆర్‌ఎంపీలు కీలకం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ పురందేశ్వరి

రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి

రాజానగరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పీఎంపీ, ఆర్‌ఎంపీల సేవలు కీలకమని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ఏపీ జేఏసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆధ్వర్యంలో ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వైద్యుల పాత్ర అనే అంశం రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో శనివారం నిర్వహించిన సమావేశానికి ఆమె విచ్చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు వైద్య సేవలు అందుతున్నాయంటే గ్రామీణ వైద్యుల వల్లేనని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ఆరోగ్య సంరక్షణలో వైద్యసేవలు అందించేది వారేనని అన్నారు. గ్రామీణ వైద్యుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానన్నారు.ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ఎప్పటికప్పుడు అనుభవజ్ఞులైన వైద్యుల వద్ద వైద్యరంగంలో వస్తున్న ఆధునిక విధానాలను తెలుకోవాలని సూచించారు.ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ఆర్‌ఎంపీ, పీఎంపీలు గ్రామీణ ప్రజల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల్లో పీఎంపీ, ఆర్‌ఎంపీలు పాల్గొని ప్రజల్ని జాగ్రతం చేయాలని పిలుపునిచ్చారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు పేదల పాలిట దైవాలని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కేజీ గోవిందరెడ్డి, జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, జేఏసీ గౌరవాధ్యక్షుడు జనార్దన్, జీఎస్ఎల్ క్యాన్సర్ వైద్యనిపుణులు డాక్టర్ తరుణ్, జేఏసీ గౌరవ సలహాదారు లంక ప్రసాదరావు, అడ్వైజర్ ఎస్ఎల్ రావు, రాష్ట్ర నాయకులు కంబాల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన


మహాసంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభులు

పిఠాపురంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు

పిఠాపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధి గాంచిన పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానంలో జరుగుతున్న దత్త జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగం గా రెండో రోజు శనివారం ప్రత్యేక పూజ లు జరిగాయి. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు లక్ష బిల్వార్చన నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య రుత్విక్‌లు కార్యక్రమాలు జరిపించారు. అంతకు ముందు మహా గణపతి పూజ, శ్రీపాదశ్రీవల్లభులకు ఏకాదశి శతరుద్రాభిషేకం, సహస్ర నామార్చన, రుత్విక్కులతో దత్త మూలమంత్ర అనుష్ఠానం, అగ్నిప్రతిష్ఠాపన, దత్తమంత్ర హోమం, వివిధ హారతులు. స్వామికి పల్లకిసేవ నిర్వహించారు. పూజాది కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య పాల్గొన్నారు.


శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న రుత్విక్‌లు

దత్తాత్రేయుడి సహస్ర తామర పుష్పార్చన

పాదగయ క్షేత్రంలో స్వయంభూ దత్తాత్రేయస్వామి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా శనివారం సహస్ర తామర పుష్పార్చన నిర్వహించారు. సాయంత్రం పుష్పార్చన అనంతరం పుష్పాలతో దత్తాత్రేయస్వామిని అలంకరించారు. ఉదయం మహాగణపతిపూజ, కలశస్థాపనలు, రుత్విక్‌వరణాలు, పంచామృతాభిషేక సహిత రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, రుత్విక్‌లతో దత్తమాల మంత్ర అనుష్టానం, అగ్నిప్రతిష్ఠాపన, దత్తమూల మంత్రహోమాలు, మంగళహారతి నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, సూపరింటెండెంట్ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర నెట్‌బాల్ పోటీలకు జట్లు ఎంపిక

పాలకోడేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగే నెట్ బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున ఆడే అండర్-14 బాలురు, బాలికల జట్టును శనివారం ఎంపిక చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామంలో పరిశీలకురాలు కల్పన, అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు సునీత, మల్లేశ్వరరావు, పీడీలు చిట్టిబాబు, ఖుద్దూస్, విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగాయి.

బాలికల జట్టు: బి.భాగ్యశ్రీ (విశాఖపట్నం), ఎస్.వెంకట నాగభవానీ ఈక్షిత (విశాఖపట్నం), పల్లి శ్రీగాయత్రి (విశాఖపట్నం), పెచ్చెట్టి బిందుశ్రీ మంజు (పశ్చిమగోదావరి), పి.వ సుందర (పశ్చిమగోదావరి), యండమూరి హన్నా (కృష్ణా), సీహెచ్. విద్యాలక్ష్మి (తూర్పుగోదావరి), ఎం.ప్రణీత (కడప), ఎంకే కీర్తిక (చిత్తూరు), ఎం.అమూల్య (గుంటూరు), డి.మెహరీన్ (నె ల్లూరు), జి.తేజశ్రీ (పశ్చిమ గోదావరి).

బాలుర జట్టు: కె.సోహిల్ (విశాఖపట్నం), ఎం. ధనుష్ మణికంఠ(విశాఖపట్నం), పి.చందు వెంకట నిఖిల్ (విశాఖపట్నం), ఎం.వెంకట శ్రీనివాస్ కుమార్ (తూర్పు గోదావరి), కె.సృజన్ (తూర్పు గోదావరి), కె.ఆంటోని (పశ్చిమ గోదావరి), బి.లోకేష్ (కృష్ణా), వి.డిల్లీబాబు (నెల్లూరు), కేపీ బాలు (గుంటూరు), ఆర్.అజయ్‌కుమార్ (విజయనగరం), టీజే శేషాద్రి (చిత్తూరు), వి.గౌతమ్‌బుద్ధ (పశ్చిమ గోదావరి).


రాష్ట్ర పోటీలకు ఎంపికైన బాలుర జట్టు

శ్రీనివాస.. గోవిందా..


అలంకార రూపంలో వేంకటేశ్వరస్వామి

- వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు
- తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు
- భారీ లైన్లలో స్వామివారి దర్శనం

ఆత్రేయపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకుమజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. భక్తులు తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భారీ లైన్ల స్వామివారిని దర్శించుకుని తులభారాలు, కానుకులు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.56.59 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అలాగే స్వామివారి అన్నప్రసాద ట్రస్టుకు విజయవాడకు చెందిన లేల్లపల్లి నారాయణ- రేవతి దంపతులు రూ.1,00,116 విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటం తీర్థప్రసాదాలను ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు అందించారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం మహిళలకు రాష్ట్రమంతా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే సౌకర్యం కల్పించడంతో దేవాలయాలు కళకళలాడుతున్నాయి. వాడపల్లి వెంకన్న ఆలయానికి పలు చోట్ల నుంచి మహిళలు వచ్చారు. అలాగే వాడపల్లి కొత్త వంతెన నుంచి ఉచిత బ్యాటరీ వాహనాల్లోను మహిళలు గోవిందుడి ఆలయానికి వస్తున్నారు.

నేటి నుంచి తిరునక్షత్ర ఉత్సవాలు

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 30 నుంచి ఆళ్వార్ తిరునక్షత్ర ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలోని ఆళ్వార్ సన్నిధిలో ఏర్పాట్లు చేస్తున్నారు. డిసెంబరు 4 వరకూ ఈ ఉత్సవాలు జరుగుతాయని ఉపకమిషనరు సూర్యచక్రధరరావు తెలిపారు. ప్రతి రోజు సేవాకాలం, ద్రవిడ వేద పారాయణం, పల్లకి సేవా మహోత్సవం, నివేదన, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.


వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ


వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆళ్వార్ల సన్నిధి

విద్యార్థి వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



మహాసభలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ కన్వీనర్ రామకృష్ణ

పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ రామకృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను సమరశీల పోరాటాలతో తిప్పికొట్టాలని పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ అన్నారు. రాజమహేంద్రవరంలో జరుగుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభల్లో భాగంగా రెండో రోజైన శనివారం జరిగిన కార్యక్రమానికి రామకృష్ణ విచ్చేసి మాట్లాడారు. విద్యారంగంలో అశాస్త్రీయ భావజాలాన్ని, మనువాద విధానాలను జొప్పిస్తున్నారని, యూనివర్శిటీలను మతోన్మాద కేంద్రాలుగా మారుస్తూ ప్రగతి శీల శక్తులపై దాడులకు ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. పాఠశాల నుంచి యూనివర్శిటీ వరకూ విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. పాలకులు మాటల్లోనే తప్ప ఆచరణలో విద్యార్థుల గోడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, యువగళం పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీలు గాలిలో కలిసిపోయాయన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్ పీడీఎస్‌యూ కార్యక్రమాల రాష్ట్ర ఉద్యమ నిర్మాణ సమీక్షను ప్రవేశపెట్టారు. నాయకులు రఫీ, భాను ప్రసాద్, సిద్దు, రూపాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం వాసికి నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు



న్యూఢిల్లీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం గ్రామానికి చెందిన వైకుంఠరావుకు నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు -2025 దక్కింది. శనివారం న్యూఢిల్లీలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత సహాయ మంత్రి రాందాస్ అథవాలే చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దేశంలో స్వేచ్ఛ, సమానత్వం కోసం పాటుపడే వారికి అంబేడ్కర్ గ్లోబల్ ఫౌండేషన్ అవార్డులు ప్రకటించింది. వైకుంఠరావు 'గాస్పల్ మినిస్ట్రీస్' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు, రాకడ వారి వృద్ధాశ్రమం నెలకొల్పి అనాథ వృద్ధులకు ఆశ్రయం కల్పించినందుకు ఈ అవార్డును అందించింది.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాజమహేంద్రవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బొమ్మూరులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుగనుంది. వీసీ ఆచార్య మునిరత్నం నాయుడు అధ్యక్షతన జరిగే ఈ సమ్మేళనంలో రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, బొమ్మూరు తెలుగు సాహిత్య పీఠం పూర్వ పీఠాధిపతి, కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య కడప రమణయ్య తదితరులు హాజరుకానున్నారు.



ఎటుచూసినా మంచు!





చలికాలం వచ్చేసింది.. తెల్లారేసరికి పొగ మంచు కమ్మేస్తుంది. ఎటుచూసినా మంచే కనిపిస్తుంది. రాజమహేంద్రవరంలో రహదారితో పాటు రైల్వే బ్రిడ్జిపై మంచుతెర దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి కెమెరా' క్లిక్ మనిపించిందిలా...

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్ రాజమహేంద్రవరం

మేమూ ఆడేస్తాం..

అమలాపురంలో దివ్యాంగులకు క్రీడా పోటీలు







చెస్, వాలీబాల్, క్యారమ్స్ ఆడుతున్న దివ్యాంగులు

అమలాపురం టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కళ్లు లేవని కలత చెందలేదు. కాళ్లు లేవని వెనుకడుగు వేయలేదు. దివ్యాంగులు ఎందులోను తక్కువ కాదని నిరూపిస్తూ ముందడగు వేశారు. డిసెంబరు 3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అభివృద్ధి అధికారి రుద్ర వైకుంఠరావు పర్యవేక్షణలో దివ్యాంగులకు పలు క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించగా ఉత్సాహంగా పాల్గొన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ ఏవై శ్రీనివాస్, సూపరింటెండెంట్ యు.రాజు సహకారంతో పోటీలను నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులు సకలాంగులకు ధీటుగా క్రీడల్లో రాణించి సత్తా చాటాలని వైకుంఠరావు సూచించారు. విభిన్న ప్రతిభావంతుల్లో మనోధైర్యం పెంచేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ క్రీడా పోటీలను ముఖ్య అతిథులు ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 300మందికి పైగా దివ్యాంగ క్రీడాకారులు పాల్గొన్నారు. బ్యాడ్మింటన్ పోటీలు 3 విభాగాల్లో నిర్వహించారు. చెస్, క్యారమ్స్, వాలీబాల్ పోటీలు జరిగాయి. విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి నిమ్మకాయల సురేష్, డెఫ్ అండ్ డెమ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, సమాఖ్య అధ్యక్షుడు కొసన సత్యసుబ్రహ్మణ్యం, జిల్లా సభ్యులు జె.పరంకుశం, నల్లా నాయుడు ఉన్నారు.

అంతా ఆన్‌లైన్..

- సత్యదేవుడి సన్నిధిలో భక్తుల సౌలభ్యం కోసం అన్నిసేవలు, ప్రసాదాలకు ఆన్‌లైన్ సౌకర్యం
- ఏపీటెంపుల్స్.ఓఆర్‌జీ వెబ్‌సైట్ లేదా మనమిత్ర వాట్సాప్ 9552300009 ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకునే అవకాశం
- ఈవో వీర్ల సుబ్బారావు

అన్నవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో భక్తులు గంటలతరబడి క్యూలైన్‌లలో నిరీక్షణ లేకుండా సేవలన్నింటికీ ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు పొందవచ్చని ఈవో వీర్ల సుబ్బారావు తెలిపారు. వ్రతం టిక్కెట్లు, వసతిగదులు, దర్శనాలు, ప్రసాదాల కొనుగోలు వీటన్నింటికీ ప్రభుత్వ ఆదేశాలు, దేవదాయశాఖ సూచనలతో అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. భక్తులు ఆన్‌లైన్ టిక్కెట్లను ఏపీటెంపుల్స్.ఓఆర్‌జీ వెబ్‌సైట్ లేదా మనమిత్ర వాట్సాప్ నంబరు 9552300009 ద్వారా బుక్‌చేసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా గోశాల, అన్నదానట్రస్ట్‌లకు విరాళాలు అన్ని క్రెడిట్, డెబిట్ కార్డులు, అన్నిరకాలైన యూపీఐ పేమెంట్ల ద్వారా చెల్లించవచ్చని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఎటువంటి నిరీక్షణ లేకుండా సంతృప్తిగా దర్శనం పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ భక్తుడు సద్వినియోగం చేసుకోవాలని ఈవో సుబ్బారావు కోరారు



తిరుచ్చివాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ

అన్నవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు సేవయిన ప్రాకారసేవ శనివారం వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి మేళతాలాలతో తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి తూర్పు రాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. పండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణలు గావించారు. అనంతరం హారతులిచ్చి స్వామి, అమ్మవార్లను ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

కుక్కకు మత్తు మందిచ్చి..

ఇంట్లో చోరీ

ల్యాప్‌టాప్, కారుతో పరారీ

కాజులూరు(కరప), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో కాజులూరు మండలం గొల్లపాలెంలోని ఒక ఇంట్లో చోరీ జరిగింది. మరమ్మతులు (రెనొవేషన్) చేస్తున్న ఇంటి గేటు బద్దలు కొట్టి పెంపుడు కుక్కకు మత్తు మందు ఇచ్చి తలుపులు పగులగొట్టి గుర్తు తెలియని దుండగులు లోపలికి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న ల్యాప్‌టాప్, కారు కీస్ తీసుకుని కారుతో సహా పరారయ్యారు. ఇంటి యజమాని భగవాన్ గొల్లపాలెం పోలీసుకు ఫిర్యాదు చేశాడు. గొల్లపాలెం ఎస్‌ఐ ఎం.మోహన్‌కుమార్, క్లూస్‌టీమ్ సీఐ పి.శ్రీనివాసులు బృందంతో సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. మత్తు మందు ఇచ్చిన పెంపుడు కుక్కను వెటర్నరీ వైద్యులు పరీక్షించారు. భగవాన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

వాడపల్లి ఆలయంలో భక్తురాలి నెక్లెస్ చోరీ

ఆత్రేయపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి వెంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన ఓ మహిళ 20 గ్రాముల బంగారం నెక్లెస్ చోరీకి గురైంది. హైదరాబాద్‌కు చెందిన పున్నపు శివ లక్ష్మి శనివారం వాడపల్లి వెంకన్న దర్శనానికి వచ్చింది. ఆలయంలో ప్రదక్షిణ చేస్తుండగా ఆమె పర్సును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. పర్సులో 20 గ్రాముల బంగారు నెక్లెస్ ఉన్నట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ ఎస్.రాము కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దొంగలు దొరికారు..

- వేర్వేరు చోరీ కేసుల్లో 12 మంది అరెస్ట్
- రూ.59.60 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- వెల్లడించిన ఎస్పీ బిందుమాధవ్





వివరాలు వెల్లడిస్తున్న కాకినాడ ఎస్పీ బిందుమాదవ్, నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తును పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

కాకినాడ క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన పలు చోరీ కేసుల్లో 12 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి రూ.59.60 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ జి.బిందుమాధవ్ ఈ వివరాలను వెల్లడించారు.

కేసుల వివరాలివి...

ఇటీవల రద్దీగా ఉండే బస్‌స్టాండ్‌లు, బస్‌స్టాప్‌లలో మహిళలే టార్గెట్‌గా హ్యాండ్‌బ్యాగ్‌లలోని విలువైన వస్తువులను ఆగంతకులు తస్కరిస్తుండడం పోలీసులకు చాలెంజ్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాలతో పెద్దాపురం ఎస్‌డీపీవో డి.శ్రీహరిరాజు నేతృత్వంలో జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టారు. తాడేపల్లిగూడెం, యాగరిపల్లి కాలవగట్టుకు చెందిన పాత నేరస్తురాలు 27 ఏళ్ల గేరక వరలక్ష్మి.. ఆమెకు సహకరించిన అదే ప్రాంతానికి చెందిన 20 ఏళ్ల మరసాని సత్యవేణిని అదుపులోకి తీసుకుని విచారించారు. వరలక్ష్మిపై గతంలో సఖినేటిపల్లిలో 2, నూజివీడులో 2, ఏలూరులో 1, తాళ్ళపూడిలో 1 పాత కేసులు ఉన్నట్టు ఎస్పీ వెల్లడించారు. వారి నుంచి జగ్గంపేట, తుని, గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 4 కేసులకు సంబంధించిన 176 గ్రాములు బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ప్రత్తిపాడు మెయిన్ రోడ్డులోని సురేష్ జ్యూయలరీ షాపులో ఈ ఏడాది సెప్టెంబరు 24న అర్ధరాత్రి షాపు షట్టర్ పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 11 కిలోల వెండి వస్తువులను దొంగిలించుకునిపోయారు. దీనిపై ప్రత్తిపాడు సీఐ బి.సూర్యఅప్పారావు పర్యవేక్షణలో ఎస్‌ఐ లక్ష్మీకాంతం బృందాలతో దర్యాప్తు చేపట్టి మధ్యప్రదేశ్‌కు చెందిన డెకాయిట్ ముఠా సభ్యులైన షేక్ ఫక్రుద్దీన్ బిషనై, కేషామెహదా, బారిక్‌సింగ్, రఘాన్ హాటియా, హీరు, మోహర్ కల్లు మెహదాను అరెస్ట్ చేసి 11 కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసులో మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు, నెల్లూరుకి చెందిన ఇద్దరు నేరస్తులు అరెస్ట్ కావల్సి ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. అలాగే అన్నవరం, గాయిత్రి కోలని మెట్టకు చెందిన గుత్తిన పవనహరి ప్రసాద్ ఇంటిలో సెప్టెంబరు 4న రాత్రి దొంగలు పడి దోచుకెళ్లారు. ప్రత్తిపాడు, అన్నవరం పోలీసులు ఈ కేసును చేధించి విశాఖపట్నం భీమిలి, చేపల ఉప్పాడకు చెందిన 38 ఏళ్ల చిన్నమాన ఎల్లాజీ అలియాస్ రాజును అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ బిందుమాధవ్ పేర్కొన్నారు. ఈ కీలకమైన కేసులను చేధించిన ప్రత్తిపాడు ఎస్‌ఐ లక్ష్మీకాంతం, అన్నవరం ఎస్‌ఐ శ్రీహరిబాబు, అడిషనల్ ఎస్‌ఐ ఎల్.ప్రసాద్, ప్రత్తిపాడు, అన్నవరం పోలీస్‌స్టేషన్‌ల సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ కెవి.సత్యనారాయణ, పెద్దాపురం ఎస్‌డీపీవో డి.శ్రీహరిరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు అంబాజీపేట విద్యార్థిని



మౌనికను అభినందిస్తున్న దృశ్యం

అంబాజీపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని మీసాల మౌనిక స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం సాయిరాం, పీడీ కె.ఆదిలక్ష్మి తెలిపారు. జనవరిలో రాజస్థాన్ బర్మర్ పట్టణంలో జరిగే బాస్కెట్‌బాల్ పోటీల్లో అండర్-19 జట్టులో మౌనిక పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా మౌనికను ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, ఎమ్.ప్రకాష్, ఉపాధ్యాయుడు బీ.మూర్తి, పీఈటీలు ఉమామహేశ్వరరావు, సూర్యకుమారి అభినందించారు.

సాఫ్ట్‌బాల్ జట్టులో జి.వేమవరం విద్యార్థులు

ఐ.పోలవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జాతీయ సాఫ్ట్‌బాల్ జట్టులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జి.వేమవరం జడ్పీ హైస్కూల్ క్రీడాకారులకు స్థానం లభించింది. కడప జిల్లా పులివెందులలో జరిగిన అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలబాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించింది. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ఐదుగురు విద్యార్థులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. బాలుర విభాగం నుంచి మద్దింశెట్టి వీరవెంకటబాలాదిత్య, కర్రి కాసువర్మ, బాలికల విభాగం నుంచి మందపల్లి ఝాన్సీశ్రీ, పులుసుగంటి కృష్ణదీపిక, చింతా రమ్యశ్రీ ఎంపికయ్యారు. వారు జనవరి 17 నుంచి 21వరకు ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారు. విద్యార్థులను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, సర్పంచ్‌లు నల్ల సుదర్శన్‌రావు, లంకలపల్లి దుర్గాదేవీ మునిరాజు, సొసైటీ అధ్యక్షులు పెంట రవి ప్రసాద్, చిక్కాల శ్రీనివాస్, నీటి సంఘం అధ్యక్షులు చోడిశెట్టి నాగబాబు, చోడిశెట్టి బ్రహ్మానందం తదితరులు అభినందించారు.

యానాంలో భారీగా గుట్కా పట్టివేత

- రూ.4 లక్షల విలువైన ప్యాకెట్ల స్వాధీనం
- వ్యక్తి అరెస్ట్



గుట్కా ప్యాకెట్లు, నిందితుడితో యానాం పోలీసులు

యానాం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): యానాం బైపాస్ 3తూములు సెంటర్లో రూ.4 లక్షల విలువైన 500 కిలోల నిషేధిత గుట్కా ప్యాకెట్లను యానాం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ సురుకుల పంపిణీ వినియోగించిన టాటా ఏసీ వాహనంలో అక్రమంగా గుట్కా ప్యాకెట్లు తరలిస్తున్నట్టు గుర్తించారు. యానాం పరిధిలో అమ్మేందుకు విశాఖపట్నం నుంచి వాహనంలో తీసుకొచ్చినట్టు తెలుస్తోంది. గుట్కా తరలిస్తున్న కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలానికి చెందిన డ్రైవర్ రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. భారీమొత్తంలో గుట్కా ప్యాకెట్లు లభ్యమయ్యాయని ఎస్పీ వరదరాజన్ తెలిపారు. వాహన తనిఖీల్లో భాగంగా పట్టుకున్న గుట్కా పట్టుకున్న ఎస్‌ఐ పూనిత్‌రాజా, బీట్ సిబ్బంది యేసురాజు, యేసుబాబు, హోంగార్డు శివశంకర్, సురేష్‌ను అభినందించారు. దీనిపై కేసు నమోదు చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడి మృతి

మరో యువకుడికి తీవ్రగాయాలు

ప్రత్తిపాడు-లంపకలోవ ఆర్‌అండ్‌బీ రహదారిపై ఘటన



ప్రమాదంలో మృతిచెందిన రాంబాబు



గాయపడిన యువకుడు దుర్గాప్రసాద్

ప్రత్తిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ప్రత్తిపాడు-లంపకలోవ ఆర్‌అండ్‌బీ రహదారిపై శనివారం రాత్రి విద్యుత్ స్తంభాన్ని మోటార్‌సైకిల్ ఢీ కొన్న ఘటనలో యువకుడు మృతిచెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడు మండలంలోని రౌతుపాలెం గ్రామానికి చెందిన ఇంటి రాంబాబు (32) మరో యువకుడు దుర్గాప్రసాద్‌తో కలిసి శనివారం రాత్రి ప్రత్తిపాడు నుంచి రౌతుపాలెం మోటార్‌బైక్‌పై వెళ్తుండగా లంపకలోవ ఇటుకబట్టీల ప్రదేశం వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్ లైటింగ్‌కు కంగారుపడి సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నారు. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న ఇంటి రాంబాబు, దుర్గాప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారికి స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అయితే ఇంటి రాంబాబు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనిపై ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నుజ్జునుజ్జుఅయిన మోటార్‌సైకిల్

విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలి

తుని రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలని 18వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ మొహ్మద్ ఆసిఫ్ అన్నారు. శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసేస్ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ఆసిఫ్ హాజరై గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో క్రమశిక్షణ ఉంటుందని, విద్యార్థులు లక్ష్యం చేరే వరకు విశ్రమించకూడదన్నారు. ఎన్‌సీసీ ద్వారా ఉజ్వల భవిష్యత్‌ను దేశ రక్షణ, సమగ్రతకు వినియోగించాలని కోరారు. విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాస్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ ఎన్‌సీసీతో అలవడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్.భానుమూర్తి పాల్గొన్నారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రదర్శించిన కవాతులు, విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్



ఆకట్టుకున్న ఎన్‌సీసీ విద్యార్థుల విన్యాసాలు

అంగన్‌వాడీ కార్యకర్తకు పాముకాటు

గొల్లప్రోలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రంలో విధుల్లో ఉన్న కార్యకర్తను పాము కాటు వేయడంతో చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు డాక్టర్ మల్లిరెడ్డి వెంకట్రాజు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో 3 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో నెంబరు 2 కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్‌గా ఉన్న కోన లోవకుమారి విధులు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో పాము కాటు వేసింది. సహచర అంగన్‌వాడీ వర్కర్లు, బంధువులు ఆమెను పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం కాకినాడకు మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

విద్యార్థినులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న డాక్టర్ కమలాంజలి

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నేషనల్ టాస్క్‌ఫోర్స్ సహకారంతో విద్యార్థినుల భద్రత, మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ వి.రాఘవకుమారి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అంజలి కౌన్సెలింగ్ సైకియాట్రిస్ట్ డాక్టర్ కమలాంజలి మాట్లాడారు. విద్యార్థులు ప్రస్తుతం ఉన్న విద్యాసంస్థల్లో ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలను వివరిస్తూ ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకునే వివిధ పద్ధతులు, మానసిక ఆరోగ్యాన్ని సంరక్షణ మార్గాలను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కమలాంజలిని సత్కరించారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రబల శ్రీవల్లి, కోఆర్డినేటర్ కె.నీరజ తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు29(ఆంధ్రజ్యోతి): స్థానిక 7వ డివిజన్‌లోని 12వ సచివాలయంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు, సందేహాల నివృతి సమావేశం జరిపారు. దీనికి అర్బన్ తహశీల్దార్ పాపారావు, డివిజనల్ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు, టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి కోరుమిల్లి విజయశేఖర్, వీఆర్వోలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు పింఛన్ల మంజూరు, రైస్‌కార్డుల్లో పిల్లలను చేర్చడం, ఇళ్ల స్థలాల మంజూరు, గతంలో మంజూరైన స్థలాలు ఇంకా అప్పగించకపోవడం వంటి అంశాలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వారి సమస్యలకు అధికారులు సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా అనంతరావు మాట్లాడుతూ ప్రజల హక్కుల పరిరక్షణలో సచివాలయ వ్యవస్థ కీలకమని అన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తహశీల్దారు పాపారావు చెప్పారు.

ప్రాచీన ఆలయాలను దర్శించిన ప్రముఖులు



జడ్జి శ్రీలక్ష్మికి స్వామి వారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఈవో భాస్కర్, సుబ్రహ్మణ్యస్వామిని దర్శిస్తున్న విజిలెన్స్ ఏఎస్పీ రాజీవ్‌కుమార్

బిక్కవోలు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు శ్రీ కుమార సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా సబ్‌జడ్జి శ్రీలక్ష్మి, విజిలెన్స్ ఏఎస్పీ రాజీవ్‌కుమార్ సుబ్రహ్మణ్యస్వామిని దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం లక్ష్మీగణపతిని దర్శించారు. వీరికి ఆలయాల ఈవో ఆకెళ్ల భాస్కర్ స్వామి వార్ల చిత్రపటాలను ఇచ్చి సత్కరించారు.కాగా షష్ఠి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి కళావేదికపై విశాఖకు చెందిన రాక్ స్టార్‌లు డాన్సులు అదరగొట్టారు. యువతీయువకులు శ్రీఆంజనేయం, లేజర్ తదితర డాన్స్‌లు చేసి అందర్నీ ప్రేక్షకులను అలరించారు.

అంగన్వాడీ కేంద్రాలకు మెటీరియల్ సరఫరాకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని 704 అంగన్వాడీ కేంద్రాల్లో పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాలు, సామగ్రి సరఫరాకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ పీడీ టి.శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ మొత్తం ప్రాజెక్టు విలువ రూ.1,35,16,800 అని, ఆసక్తి కల్గిన సంస్థలు రూ.5,000 చెల్లించి జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి పేరిట ఏదైనా జాతీయ బ్యాంకులో డీడీ తీసి దరఖాస్తు ఫారాలను తీసుకోవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను డిసెంబరు 8వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా కలెక్టరేట్‌లోని జేసీ కార్యాలయంలో దాఖలు చేయాలని కోరారు.

సేంద్రీయ ఎరువులను వినియోగించాలి

బిక్కవోలు, నవంబరు 29(ఆంధ్రజోతి): రసాయనిక ఎరువులు వాడకం మాని సేంద్రీయ ఎరువులను వినియోగించుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్ రైతులకు సూచించారు. ఇళ్లపల్లిలో శనివారం నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వివరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పడాల వెంకటరామారెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, నాయకులు తనుకు శ్రీధర్, పంచికట్ల నాగరాజు, చెల్లే జోష్‌బాబు, అనుసూరి సుబ్బారావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యవసాయ విస్తరణాధికారి మృతి



ప్రత్తిపాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విస్తరణాధికారి ఎం.శివ గుండెపోటుతో శనివారం పెద్దిపాలెంలో మృతి చెందారు. శివ ప్రస్తుతం విస్తరణాధికారిగా, వ్యవసాయ మట్టి నమూనా పరిశీలకుడిగా రాజమహేంద్రవరం ప్రాంతంలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం రాజమండ్రిలో నివాసం ఉంటున్న శివ శుక్రవారం సాయంత్రం స్వగ్రామం పెద్దిపాలెంలో జరిగిన ఒక శుభ కార్య క్రమానికి భార్య, పిల్లలతో చేరుకున్నారు. అయితే ఇంటి వద్ద భోజ నం చేసి నిద్రపోయిన శివకు శనివారం వేకువజామున గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఏలేశ్వరం ఆసు పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. కాగా శివకు భార్య సుహాసిని, పదేళ్ల కీర్తి సహస్ర, ఆరేళ్ల పవన్‌తేజ ఉన్నారు. శివ భౌతికకాయాన్ని రాజమహేంద్రవరం ఏపీ ఎన్జీవో జిల్లా కమిటీ చైర్మన్ మీసాల మాధవరావు, రాజమహేంద్రవరం వ్యవసాయ శాఖ ఏడీఏ కె.సూర్యరమేష్, జిల్లా వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి సతీష్, నాగేశ్వరరావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

అప్రమత్తంగా ఉండండి

దేవరపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండి కళ్లాల్లోని ధాన్యాని సురక్షిత ప్రాంతాలకు,ఆరిన ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలించాలని తహశీల్దార్ ఎం.శ్రీనివాస్, ఏవో కమలరాజు సూచించారు. యర్నగూడెం, త్యాజంపూడి, గౌరీపట్నం, దుద్దుకూరులో ధాన్యాన్ని రహదారి సర్వీస్ రోడ్డుల్లో ఆరబెట్టిన రైతులతో ఏవో మాట్లాడారు.

రిఫరీగా పీఈటీ సురేష్

కొవ్వూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో జరుగుతున్న బీచ్ వాలీబాల్ పోటీలకు రిఫరీగా కుమారదేవం జడ్పీ హైస్కూల్ పీఈటీ రాపాక సురేష్ వ్యవహరిస్తున్నారు. ఈనెల 26 నుంచి డిసెంబరు 1 వరకు ఖేలో ఇండియా యూనివర్సిటీ బీచ్ వాలీబాల్ పోటీలు జరుగుతున్నాయి.

గుక్కెడు నీళ్లు పట్టుకోనివ్వరా!

» పబ్లిక్ వాటర్ ట్యాప్ బంద్
» మున్సిపల్ వాటర్‌వర్క్సు అధికారుల నిర్వాకం
» వందలాది మంది కటకట


నారాయణపురం ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద బంద్ చేసి ఉన్న ట్యాప్

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

పరిసర గ్రామ ప్రజల మంచినీటి అవసరాలను తీర్చే పబ్లిక్ ట్యాప్‌ను మూసేసి, వందలాది మంది ప్రజలకు కనీసం మంచినీళ్లు కూడా దక్కకుండా చేసిన మునిసిపల్ కార్పొరేషన్ వాటర్ వర్క్స్ అధికారుల నిర్వాకం ఇది. కంబాలచెరువు నుంచి లాలాచెరువు వెళ్లే సెంట్రల్ జైలు రోడ్డులో నారాయణపురం వాటర్ ట్యాంకుల వద్ద రోడ్డు వైపు ఒక పబ్లిక్ కుళాయి ఉండేది. ఇక్కడ వాటర్ ట్యాంకులు నిర్మించిన నాటి నుంచి ఈ పబ్లిక్ ట్యాప్ ఉంది. నగరంలోని వాటర్ ట్యాంకులు ఉన్న చోటల్లా ఈ పబ్లిక్ ట్యాప్‌లు ఉంటాయి. గతంలో రోడ్ల పక్కన ఉండే పబ్లిక్ ట్యాంకులు అదృశ్యం కావడంతో ఈ ట్యాప్‌కు డిమాండ్ ఏర్పడింది. నగరంలో అధికారుల లెక్కల్లో 300 వరకూ పబ్లిక్ కుళాయిలు ఉన్నట్టు చెబుతున్నా ఎక్కడా కనిపించవు. పబ్లిక్ కుళాయిలు అదృశ్యం కావడంతో వాటర్ ట్యాంకులు ఉన్న చోట పబ్లిక్ ట్యాప్‌ల ద్వారా నీటిని పట్టుకోవడం పరిపాటిగా మారింది. నారాయణపురం వాటర్ ట్యాంకుల వద్ద ఉన్న ఓ ట్యాప్ వల్ల దివాన్‌చెరువు,లాలాచెరువు, రాజానగరం పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు సిటీలో వాటర్ సమస్య ఉన్న ప్రాంతాల ప్రజలు నీటిని పట్టుకునేవారు. ఎందుకో తెలియదు కానీ ఇటీవల ట్యాప్‌ను బంద్ చేశారు. దీంతో అనేకమంది నీటి కోసం వచ్చి నిరాశతో తిరిగి వెళుతున్నారు. నారాయణపురం ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద ట్యాంకర్లలోకి నీరుపట్టే పైపు నుంచి నిత్యం నీళ్లు వృథా అవుతుంటాయి. వాటిని అరికట్టడానికి అధికారులు కనీసం చర్యలు తీసుకోరు. కానీ ఇక్కడ పబ్లిక్ ట్యాప్‌ను మాత్రం నిర్ధాక్షిణ్యంగా మూసేశారు. దివాన్‌చెరువుకు చెందిన సూరారపు డేవిడ్‌రాజు ఈ ట్యాప్ కు ఒక బోర్డు తగిలించారు. గోదావరి మంచి నీటిని ఎవరూ వృథా చేయవద్దని, ఆటోలు, కార్లు కడగరాదని విజ్ఞప్తి చేయడంతో పాటు ప్రజావసరాల కోసం అధికారులు వెంటనే ఈ ట్యాప్‌ను పునరుద్ధరించాలని కోరడం గమనార్హం. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆఫీసు నుంచి ఫోన్ చేసి చెప్పినా వాటర్‌వర్క్సు అధికారులు నిర్లక్ష్యంగా ఉండడంతో విమర్శలు వినవస్తున్నాయి.

పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

» మంత్రి కందుల దుర్గేష్ » రాజమహేంద్రవరంలో గోదావరి బాలోత్సవం


బాలోత్సవం సభలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో సృజనాత్మకత అంతర్లీనంగా దాగి ఉంటుందని, దాన్ని వెలికితీసేందుకు బాలోత్సవం వంటి కార్యక్రమాలు స్ఫూర్తిగా నిలుస్తాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గోదావరి బాలోత్సవం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన సభకు మంత్రి దుర్గేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఉపాధ్యాయులు పిల్లలకు విద్యాబోధనతోపాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మక శక్తులను వెలికితీసేందుకు కృషి చేయాలన్నారు. నేటి సమాజంలో పిల్లల పెరుగుదలపై తల్లిదండ్రులు ఎంతో ఆందోళన చెందుతున్నారని, విద్యార్థులు మంచి మార్గంలో పయనిస్తున్నారా లేక పెడదోవ పడుతున్నారా అనే ఆందోళన ప్రతి తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయుల్లోనూ ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మంచి సమాజం వైపు పిల్లల ఆలోచలను మార్పు చేయాల్సిన అవసరం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. ఎమ్మెల్సీ బొర్రా గోపీ మూర్తి, తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావు, సీసీసీ ఎండీ పంతం కొండలరావు, నాట్యాచార్యులు సప్పా దుర్గాప్రసాద్ తదితరులు మాట్లాడారు. బాలోత్సవం ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తులసి మాట్లాడుతూ బాలోత్సవం లక్ష్యాన్ని వివరించారు. జిల్లా విద్యాశాఖాధికారి పి.వాసుదేవరావు, ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం తదితరులు పాల్గొన్నారు.

బంగారు బిస్కెట్లుపై నిగ్గు తేల్చాక చర్యలు

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒక అధికారిణికి మాజీ ఎంపీ భరత్‌రామ్ బంగారు బిస్కెట్లు ఇచ్చిన వ్యవహారంలో వాస్తవాలు బయటకు వస్తాయని, అప్పుడు చట్టప్రకారం చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక తిలక్ రోడ్డులోని రెడ్డి కళ్యాణ మండపం లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బంగారు బిస్కెట్లు ఇచ్చేంత పని ఏమి జరిగిందో.. ఎంత ప్రయోజనం కలిగితే అంత పెద్దఎత్తున బంగారం బిస్కెట్లు ఇచ్చారనే దానిపై వాస్తవాలు బయటకు వస్తున్నాయన్నారు.భరత్‌రామ్ లా తాము ఫేక్ ఆడియో, వీడియోలతో అసత్య ప్రచారాలు చేయబోమన్నారు. రూ.100 కోట్ల విలువైన విమాన శిక్షణ కేంద్రం తీసుకొచ్చామని, అది ప్రైవేట్ వ్యక్తులు స్థాపించిందని, ఇది కూడా పూర్తిగా తెలుసుకోకుండా అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. రాష్ట్ర ప్రజలు జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని అస్సలు అతను రాష్ట్రంలో ఏ సమస్య పై పోరాడుతున్నాడో అర్థం కావడంలేదన్నారు. ఇటీవల విద్యార్థులు నిర్వహించిన మాక్ అసెంబ్లీని చూసైనా జగన్‌కు బుద్ధి రావాలని ఎమ్మెల్యే వాసు పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ.. ఇదిలా ఉండగా నగరంలో వివిధ ఆరోగ్య సమస్యలతో కార్పొరేట్ హాస్పిటల్స్‌లో వైద్యం చేయించుకున్న 34 మందికి సీఎంఆర్ఎఫ్ కింద రూ.25,37,483 చెక్కులను ఎమ్మెల్యే వాసు అందించారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఒక్క రాజమహేంద్రవరంలోనే సీఎంఆర్ఎఫ్ కింద 341 మందికి రూ.3,27,84,177 అందించినట్టు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు,వర్రే శ్రీనివాసరావు, వై.శ్రీనివాస్, ఉప్పులూరి జానకిరామయ్య, కొయ్యల రమణ, మళ్ల వెంకట్రాజు, కొల్లి బుజ్జి, మొకమాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనపర్తిలో టీచర్స్ టోర్నమెంట్ ఎంపికలు


అనపర్తి నుంచి డివిజన్ టోర్నమెంట్‌కు ఎంపికైన ఉపాధ్యాయినులు


కడియంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

అనపర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహించనున్న టీచర్స్ టోర్నమెంట్‌లో వివిధ క్రీడలకు సంబంధించి మండల స్థాయి ఎంపికలు శనివారం అనపర్తిలో నిర్వహించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మహిళల త్రోబాల్ ఎంపికలు, బాలుర ఉన్నత పాఠశాలలో పురుషుల క్రికెట్ జట్టు ఎంపికలు జరిపారు. ఈ పోటీల్లో ఎంపికైన వారంతా ఈనెల 13, 14 తేదీల్లో రాజమహేంద్రవరంలో నిర్వహించే డివిజన్ స్థాయి ఎంపికల్లో పాల్గొంటారని మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ టీవీఎస్ రాఘవరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డివిజన్ కో ఆర్డినేటర్ పడాల శ్రీనివాసరెడ్డి, పీడీలు రాజేశ్వరి, ప్రభాకరరెడ్డి, మనోహర్, సతీష్, దుర్గాప్రసాద్, ప్రియాంక, హేమలత తదితరులు పాల్గొన్నారు.

కడియం: కడియం ఉన్నత పాఠశాలలో మండలంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులకు క్రికెట్, త్రోబాల్ క్రీడల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని, విద్యాకమిటీ చైర్‌పర్సన్ గారపాటి సత్య, ఎంపీడీవో కె.రమేష్ విచ్చేశారు. మండలంలో హెచ్‌ఎం టి.సత్యనారాయణతోపాటు వివిధ పాఠశాలల వ్యాయామోపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు డిసెంబర్ 13, 14 తేదీల్లో డివిజన్ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఎంఈవోలు ఎస్.మణికుమార్, వై.నాగేశ్వరరావు, క్రీడా కార్యదర్శి ఎం.డేవిడ్ తెలిపారు.

తంటికొండ దేవస్థానం ఈవోగా ఉదయబాబు



గోకవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని తంటికొండ గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా చల్లా ఉదయబాబునాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. దేవదాయ ధర్మాదాయ శాఖలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. చైర్మన్ బదిరెడ్డి అచ్చన్నదొర సహకారంతో ఆలయ అభివృద్ధికి, భక్తులకు అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం రత్నంపేటలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం మూడో రోజున వలంటీర్లకు ట్రాఫిక్ రూల్స్, రోడ్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మోటివేషనల్ స్పీకర్లు పి.పట్నాయక్, రాము, వైకుంఠరావు, ట్రాఫిక్ కానిస్టేబుల్ జి.రవికుమార్ అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఎంకేఎస్ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీవో దంటు వీర వెంకట్రావు, లక్ష్మీ ప్రవీణ పాల్గొన్నారు.

ఈవీఎంల గోదాము తనిఖీ

రాజమహేంద్రవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నెలవారీ తనిఖీల్లో భాగంగా ఈవీఎంలను భద్రపరిచిన గోదాములను డీఆర్వో సీతారామ మూర్తి శనివారం తనిఖీ చేశారు. నియోజకవర్గాల వారీగా భద్రపరిచిన ఈవీఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశామని, కెమెరాల పనితీరు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించామని పేర్కొన్నారు.

పశ్చిమగోదావరి జిల్లా కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకుడిగా తాళ్లూరి



రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి విజయకుమార్‌ను పశ్చిమగోదావరి జిల్లా కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకుడిగా ఆ పార్టీ రాష్ట్ర చైర్మన్ షేక్ మస్తాన్ వలీ నియమించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని ఎన్నిక చేసేందుకు జరుగుతున్న ఎన్నికలకు తాళ్లూరిని పీసీసీ అధ్యక్షురాలు షర్మిళారెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్టు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు నేరుగా జిల్లా అధ్యక్షులతో సమన్వయానికి సరికొత్త విధానం అమలులో ఉందని, అందులో భాగంగానే సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమానికి తమ నాయకుడు రాహుల్ గాంధీ శ్రీకారం చుట్టారని విజయకుమార్ అన్నారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహిస్తానన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేత

కోరుకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలం గాదరాడ గ్రామానికి చెందిన గొడ్డు శివరామకృష్ణ వైద్య సహాయం నిమిత్తం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సిఫార్సుతో సీఎంఆర్ఎఫ్ నిధులు ద్వారా మంజూరయిన రూ.2లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో పలువురు జనసేన, తెలుగుదేశం, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడూ పనిచేయనున్న విద్యుత్ బిల్లుల వసూలు కౌంటర్లు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లోని విద్యుత్ బిల్లులు కట్టించుకునే కౌంటర్లు ఆదివారం కూడా పనిచేస్తాయని ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ ఎస్ఈ కె.తిలక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇంకా విద్యుత్ బిల్లులు చెల్లించని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి


ఇరిగేషన్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

సాగునీరు సక్రమంగా అందించాలి
ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అధికారులను ఆదేశించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఇరిగేషన్ అధికారులు,పుష్కర, తొర్రిగడ్డ, చాగల్నాడు, వెంకటనగరం పథకాల చైర్మన్లు, వైస్ చైర్మన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా గ్రామాల్లో గుర్తించిన సమస్యలతోపాటు, అత్యవసర పనుల పైనా, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులపైనా సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం రైతులకు సాగునీరు, కాలువల, చెరువుల అభివృద్ధి వంటి అత్యవసర పనులపై ఎమ్మెల్యే సమీక్షించారు. పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, ఎక్కడైనా నాణ్యత లోపిస్తే సహించేది లేదని హెచ్చరించారు. రాబోయే పంట సమయానికి సాగు నీరందించే విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా మరమ్మతులు, పంట కాలువల పూడిక తీత పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు తమకున్న ఇబ్బందులు, తమ ద్వారా జరుగుతున్న పనులు, ప్రతిపాదించాల్సిన పలు ముఖ్యమైన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అన్నింటి పైన సుదీర్ఘంగా సమీక్షించిన అనంత రం రైతాంగానికి సాగునీరు అందించడంపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఎక్కడా రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల ఆదేశించారు. సమావేశంలో ఇరిగేషన్ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా వాలీబాల్ పోటీల ఎంపికలు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వాలీబాల్ క్రీడాకారులు

కొవ్వూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వాలీబాల్ బాలుర సబ్ జూనియర్స్, జూనియర్, యూత్, సీనియర్ జట్ల జిల్లా స్థాయి ఎంపిక పోటీలు స్థానిక ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో శనివారంతో ముగిశాయి. మొత్తం అన్ని విభాగాలకు సంబంధించి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో టీముకి 16 మందిని ఎంపికచేశారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్, జనవరి నెలల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి జీ.రాఘవేంద్రరావు,గౌతమీ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పరిమి హరిచరణ్, సూరపనేని చిన్ని, కొయ్యల ప్రసాద్, ఇస్మాయిల్, డి.సత్యనారాయణ,వి.విజయ్, రాయుడు, సూర్యచంద్రం, పీడీలు కోడి రామ్‌కుమార్, బి.సతీష్, జె.సురేష్, ఇ.రామకృష్ణ పాల్గొన్నారు.


మున్సిపల్ నిధుల దుర్వినియోగంపై విచారణకు ఆదేశం

కొవ్వూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మున్సిపాల్టీలో 2015-16 ఆర్థిక సంవత్సరంలో రోడ్డు మార్జిన్, డైలీ మార్కెట్, వీక్లీ మార్కెట్ ఆశీల వేలంపాటలో మున్సిపల్ నిధు లకు భారీ నష్టం కలిగించారనే ఆరోపణలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఆయా సంవత్సరాల్లో మున్సిపాల్టీలో పనిచేసిన కమిషనర్ టీ.నాగేంద్రకుమార్, మేనేజర్ బి.శ్రీధర్ (రిటైర్డ్), ఆర్ఐ పి.సాయిబాబు(రిటైర్డ్), జూనియర్ అసిస్టెంట్‌లు యూవీ నూకాంబిక, మీసాల హరనాథ్‌పై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు ఉత్తర్వు అందిన తేదీ నుంచి 15 రోజుల్లో రాతపూర్వకంగా సమాధానం అందించాలని అందులో పేర్కొన్నారు.

విద్యాదానం గొప్పది!


సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

నల్లజర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాల్లో కంటే విద్యాదానం గొప్పదని జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు అన్నారు. శనివారం నల్లజర్ల ఎస్ఆర్‌కే కోఆపరేటివ్ కళాశాలలో ఇప్పటి వరకు పని చేసిన సీనియర్ గణిత శాస్త్రం లెక్చరర్ నాగిరెడ్డి సత్యనారాయణ (ఎన్ఎస్ఎన్) పదవీ విరమణ కార్యక్రమం శనివారం కళాశాలలో చైర్మన్ వసుంధరాదేవి ఆధ్వర్యంలో జరిగింది.ముందుగా పూర్వ, ప్రస్తుత విద్యార్థులు ఎన్ఎస్ఎన్ దంపతులను సెంటర్ నుంచి కళాశాల వరకు మేళతాళాలతో భారీ ర్యాలీగా తీసుకుని వచ్చారు. జడ్పీ మాజీ చైర్మన్ బాపిరాజు దంపతులను ఘనంగా సత్కరించారు. బాపిరాజు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా లెక్చరల్ వృత్తిలో ఉంటే అనేక మందిని ప్రయోజకులను చేసిన ఘనత ఎన్ఎస్ఎన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ సుంకర సుబ్బారావు, దొరయ్య, కొడాలి ఆంజనేయ చౌదరి, కొరారి గాంధీ, వేగి గాంధీ, కోరా కన్నయ్య, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు మునిసిపాలిటీలో అవకతవకలపై విచారణకు ఆదేశం 8
విద్యార్థులకు పోషకాహారం అందించాలి

వజ్రోత్సవ వేడుకల స్తూపం ఆవిష్కరణ

నిడదవోలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వజ్రోత్సవ వేడుకల స్తూపం పురపాలకసంఘం 60 ఏళ్ల చరిత్రకు నిదర్శనంగా నిలుస్తుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మునిసిపల్ కార్యాలయంలో శనివారం సాయంత్రం వజ్రోత్సవ వేడుకల స్తూపం ఆవిష్కరించి మాట్లాడారు. మునిసిపల్ అధికార్లు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయడం ఆనందదాయకం అన్నారు. కూటమి ప్రభుత్వం స్పెషల్ గ్రేడ్ మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయడం నిడదవోలు పురపాలక సంఘానికి ఇచ్చిన గిఫ్ట్ అన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ వజీరుద్దీన్, కమిషనర్ తోట కృష్ణవేణి, కౌన్సిలర్లు గోపిరెడ్డి శ్రీనివాస్, జాన్‌బాబు,గంగుల వెంకటలక్ష్మి, చిలకల శారదాదేవి పాల్గొన్నారు.



స్తూపం ఆవిష్కరణలో మంత్రి దుర్గేష్ చిత్రంలో చైర్మన్ ఆదినారాయణ తదితరులు



రాష్ట్రం బాగుండాలనే శ్రీరుద్రయాగం


స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అనపర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రం దుష్ట గ్రహాల బారిన పడకుండా ప్రజలంతా సంతోషంగా ఉండాలన్న ఆకాం క్షతో 41 రోజుల పాటు శ్రీరుద్రయాగం నిర్వహిస్తున్నామని స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. పెడపర్తిలోని పార్వతి రామలింగేశ్వర స్వామి ఆలయంలో అయ్యన్న పాత్రుడు ఆధ్వర్యంలో 41 రోజుల పాటు శ్రీరుద్ర యాగంతో పాటుగా పలు యాగాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం ఆయన స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. యాగ కార్యక్రమాలు చివరి దశకు చేరుకుంటున్న నేపథ్యంలో మరోసారి స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చానన్నారు. బ్రహ్మశ్రీ యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య ఆధ్వర్యంలో యాగ కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయన్నారు. అనం తరం ఆలయ అర్చకులు స్పీకర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

లెక్కకు.. చిక్కేనా!

పులుల జాడెక్కడ

- అభయారణ్యంలో రేపటి నుంచే గణన
- 3 రోజులు అడవిలో అడుగుజాడల గుర్తింపు
- 2022లో 6 చిరుతలు, 4 పెద్దపులులు





(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అడవుల్లో పులుల లెక్కింపునకు రంగం సిద్ధమైంది. పాపికొండల అభయారణ్యం, కాకినాడ, ఏలేశ్వరం అటవీ డివిజన్లలో వీటి సంఖ్య లెక్కించేందుకు సోమవారం నుంచి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.తొలి మూడు రోజులు రోజుకు ఐదు కిలోమీటర్ల పాటు అడవుల్లో తిరిగి వీటి అడుగులు,ఇతర గుర్తులు సేకరించనున్నారు. ఆ తర్వాత ట్రాన్సెక్ట్ లైన్ ఏర్పాటు చేసి దాని వెం బడి 280కిపైగా ట్రాప్ కెమెరాలు బిగించి పులులను లెక్కించనున్నారు. 2022లో నిర్వహించిన సర్వేలో పాపికొండల్లో ఆరు చిరుతలు, నాలుగు పెద్ద పులులు గుర్తించారు.ట్రాప్ కెమెరాకు చిక్కని పులులు ఎక్కువగానే ఉండొచ్చని తేల్చారు.గతేడాది సెప్టెంబరులో పాపికొండల నుంచి పు లులు దారితప్పి రాజమహేంద్రవరం పుష్కరవనం, ప్రత్తిపాడులో సంచరించి బెంబేలెత్తించాయి.

నాలుగేళ్లకు ఒకసారి..



పాపికొండల అభయారణ్యంతో పాటు కాకినాడ, ఏలేశ్వరం, రంపచోడవరం అటవీ డివి జన్లలో పులులు, చిరుతలు ఎన్ని ఉన్నాయనే దానిపై అటవీ శాఖ నాలుగేళ్లకోసారి పులుల లెక్కింపు చేపడుతోంది. చివరిగా పాపికొండల్లో 2022లో పులుల లెక్కింపు జరిగింది. ఉమ్మడి తూర్పు, ఉమ్మడి పశ్చిమ జిల్లాల్లోని అభ యార ణ్యంలో రెండు దశల్లో చెరో 45 రోజులు 116 ప్రాంతాల్లో 232 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి సంఖ్య లెక్కించారు.అందులో భాగంగా నాలుగు పెద్దపులులు, ఆరు చిరుతలు ఉన్నట్టు తేల్చారు. ట్రాప్ కెమెరాకు చిక్కని చిరుత పులులు మరో పది వరకు ఉండొచ్చని అంచనా వేశారు. రంపచోడవరం,మారేడుమిల్లి అడవుల్లో పులుల కంటే చిరుతల సంచారం అధికంగా ఉందని నిర్ధారిం చారు.2018లో నిర్వహించిన సర్వేలో ట్రాప్ కెమె రాలకు పులులు,చిరుతలు చిక్కలేదు. దీంతో ఆ ఏడాది సర్వే వివరాలను బయట పెట్టలేదు.

పులుల ఆవాసం అక్కడే..

పులులు, చిరుత పులులకు పాపికొండల అభయారణ్యం పెట్టింది పేరు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, అల్లూరి జిల్లా ఏజెన్సీ కలిపి మొత్తం 2.6 లక్షల ఎకరాల్లో పాపికొండలు విస్తరించి ఉన్నాయి. మొత్తం 391 చదరపు మైళ్ల విస్తీర్ణంలో ఉన్న పాపికొండల మధ్యలో గోదావరి ఉంది. అందుకే పులుల ఆవాసానికి పాపికొండలు ప్రసిద్ధి. ఈ పులులు గోదావరికి అటూ ఇటూ తిరుగుతుంటాయి. దట్టమైన అటవీప్రాంతం కావడంతో అనేకరకాల పక్షులు,జంతువులు సైతం సంచరిస్తుంటాయి.ఆహారం,నీటికి పులులకు పాపికొండల్లో ఢోకా ఉండదు.దీంతో పాపికొండల అభయా రణ్యంలో పులుల సంచారం అధికం.ఇంత అనుకూల వాతావరణం ఉండడంతో ఏటా వీటి సంతానం వృద్ధి చెందుతోంది.

పులుల సర్వే చేస్తారిలా..

సర్వేలో పులులు,చిరుతల లెక్క పక్కాగా తేల్చడానికి అటవీ శాఖ నాగార్జున సాగర్- శ్రీశైలం టైగర్ రిజర్వు (ఎన్‌ఎస్‌టీఆర్), వైల్డ్‌లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూ ఐఐ) నిపుణులతో కలిసి పనిచేయనుంది.ఫిబ్రవరి మొదటి వారానికి పులులు, చిరుతల సంఖ్య తేలనుంది. ఈ దఫా పులుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో ఉన్న నాలుగు పెద్దపులులు, ఆరు చిరుతలు రెట్టింపునకు పైగా ఉండొచ్చని భావిస్తున్నారు. ప్రధానంగా గడచిన కొన్నేళ్లలో వీటి సంతానం బాగా వృద్ధి చెంది ఉంటుందని విశ్లేషిస్తున్నారు. పైగా గతేడాది పాపికొండల నుంచి దారితప్పి పులులు బయటకు వచ్చిన సంఘటనలను విశ్లేషిస్తున్నారు.

280 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు

20 బీట్ల పరిధిలో పులుల లెక్కింపునకు అధికారులు ఏర్పాట్లు చేశారు. తొలి మూడు రోజుల పాటు అభయారణ్యం, అటవీ డివిజన్లలో ఒక్కో రూట్‌లో రోజుకు ఐదు కిలోమీటర్ల చొప్పున అటవీ సిబ్బంది అడవిలో తిరగనున్నారు. పులులు, చిరుతలు,ఇతర మాంసాహార జంతువుల పాద ముద్రలు, ఇతర గుర్తులు సేకరిస్తారు.ఈ వివరాలను ఎం-స్ట్రైప్స్ యాప్‌లో నమోదు చేస్తారు. డిసెంబరు 6 నుంచి 8 వరకు అభయారణ్యంలో ట్రాన్సెక్ట్ లైన్ సిద్ధం చేస్తారు. నెలాఖరుకు గుర్తించిన ప్రాంతాల్లో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. పాపికొండల అభయారణ్యం పరిధిలో, 220, కాకినాడ,ఏలేశ్వరం డివిజన్లలో 60 కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.

రంపచోడవరాన వాయిదా

గతేడాది సెప్టెంబరులో రాజమహేంద్రవరం నగరంలోకి చిరుత దారి తప్పి వచ్చింది. పాపికొండల అభయారణ్యం విస్తరించిన వీఆర్‌పురం, రంపచోడవరం, మారేడుమిల్లి, గోక వరం మీదుగా చిరుత రాజమ హేంద్రవరంలోకి దారి తప్పి వచ్చి ఉండొచ్చని భావించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి పోలవరం ప్రాజెక్టు మీదుగా రంప ఏజెన్సీ వరకు విస్తరించి ఉన్న పాపికొండల అభయారణ్యంలో పులుల సంచారం బాగా పెరిగిందని అటవీశాఖ అంచనా వేస్తోంది. రంపచోడవరం అటవీ డివిజన్ పరిధిలో ఇటీవల మావోల సంచారం నేపథ్యంలో తాత్కాలికంగా ఇక్కడ పులుల గణన వాయిదా వేసినట్లు అటవీశాఖ తెలిపింది.



ఎంపీ పురందేశ్వరిని సత్కరిస్తున్న మహిళలు చిత్రంలో ఎమ్మెల్యే నల్లమిల్లి, ఎమ్మెల్సీ సోము

మహిళలు ఆత్మ నిర్భరత సాధించాలి

ఎంపీ పురందేశ్వరి

అనపర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆత్మ నిర్భరత సాధించినపుడే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని అందుకే ప్రధాని మోడీ ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమాన్ని రూపొందించారని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. అనపర్తి మండలం రామవరంలోని ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన ఆత్మ నిర్భర్ భారత్ సంకల్ప అభియాన్ మహిళా సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. కేంద్ర పథకాలు మహిళలకు పూర్తి స్థాయిలో చేరాలన్న సంకల్పమే ఆత్మ నిర్భర్ లక్ష్యమన్నారు. మహిళలు బలపడితే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మూలమని.. తద్వారా మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ స్వదేశీ వస్తువులు కొనడం ద్వారా దేశ ఆర్థిక పరిస్థితి బలపడుతుందన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధికి కేంద్రం అనేక పథకాలు రూపొందించిందన్నారు. డ్వాక్రా మహిళలకు రూ.2 లక్షల రుణం నుంచి రూ.20లక్షల రుణం వరకు పెంచిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు.అనంతరం ఎంపీ పురందేశ్వరిని గజమాల, దుశ్శాలువాతో ఎమ్మెల్యే నల్లమిల్లి ఆధ్వర్యంలో కూటమి మహిళలు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కళ్యాణ చక్రవర్తి, హారిక, ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లిడి సురేంద్రరెడ్డి, జిల్లా కార్యదర్శి హేమతులసి, నియోజకవర్గ మండలాల బీజేపీ అధ్యక్షులు,నాయకులు పాల్గొన్నారు.

డిసెంబరు 5న పేరెంట్ టీచర్స్ మీట్

రాజమహేంద్రవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిసెంబరు 5న 956 ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే మెగా పేరెంట్ టీచర్ మీటింగ్(పీటీఎం)కి ఘనంగా ఏర్పాటు చేస్తున్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు. కలెక్టర్ కీర్తి చేకూరితో శనివారం సమీక్షించారు. జిల్లాలో 93,399 మంది విద్యార్థులు, 2 లక్షల మందికిపైగా తల్లిదం డ్రులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి ప్రత్యేక కార్యక్రమం ఉంటుంద న్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, విద్యార్థుల వ్యక్తిగత వికాసం, తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంపు లక్ష్యంగా పీటీఎం ఉంటుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆ రోజున ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ, తరగతి ఉపాధ్యాయులతో చర్చలు, విద్యార్థులకు క్రీడా కిట్లు, సైన్స్ ప్రాజెక్టులు, ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ మేఘ స్వరూప్, ఎమ్మెల్సీ రాజశేఖర్, ఎమ్మెల్యే ముప్పిడి పాల్గొన్నారు.

పుష్కరాలకు సన్నద్ధం కండి

- 7 కోట్ల మంది భక్తుల అంచనా
- 2015లో 5 కోట్ల మంది రాక
- 2027లో మరింత పెరిగే ఛాన్స్
- శాఖల మధ్య సమన్వయం కీలకం
- ప్రతిపాదనలు చేయాలని ఆదేశం
- అధికారులతో మంత్రి సమీక్ష



పుష్కరాలపై సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్ చిత్రంలో ఎంపీ పురందేశ్వరి, కలెక్టర్ కీర్తి చేకూరి,ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, ముప్పిడి వెంకటేశ్వరరావు, నల్లమిల్లి తదితరులు

రాజమహేంద్రవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాబోయే పుష్కరాలకు 7 కోట్ల నుంచి 8 కోట్ల మంది భక్తులు వస్తారనే అంచనా ఉందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.స్థానిక కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ కీర్తి చేకూరి అధ్యక్షతన ప్రజాప్రతినిధులు, సమన్వయ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాబోయే పుష్కరాలు ఒక శుభారంభం.. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసేలా పుష్కరాలకు భారీ స్థాయిలో సన్నద్ధమవుతున్నామని చెప్పారు. శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని.. ఇప్పటికే అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, అంచనాలతో ముందుకు వచ్చారన్నారు. పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారి వీర పాండ్యన్‌ను స్పెషల్ ఆఫీసర్‌గా నియమించిందని, కేబినెట్ సబ్-కమిటీని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈసారి పుష్కరాలకు సమర్థవంతమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని రవాణా, మౌలిక సదుపాయాల బలోపేతంపై దృష్టి సారిస్తున్నామన్నారు. అఖండగోదావరి ప్రాజెక్టును పుష్కరాల నాటికి పూర్తిచేస్తామన్నారు. జిల్లాలో ప్రజాప్రతినిధుల నుంచి సంబంధిత ప్రాంతాల పనుల వివరాలు సేకరించి, వాటిని ప్రతిపాదనల్లో చేర్చాలని సూచించారు. రద్దీని ఎదుర్కొనడానికి నిడదవోలు రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయాల్సి ఉందని చెప్పారు. ప్రత్యేక రైళ్లకు హాల్ట్ కల్పించాలని రైల్వే అధికారులకు సూచించారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ 2015 గోదావరి పుష్కరాలకు దాదాపు 5 కోట్ల మంది భక్తులు రాగా ఈసారి 7 కోట్ల నుంచి 8 కోట్ల మంది వరకూ రావొచ్చనే అంచనా ఉందని తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. శాఖలవారీ అంచనా నివేదికలు సిద్ధమైన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి పంపి అవసరమైన నిధులు పొందడానికి కృషిచేస్తామని చెప్పారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఘాట్ల అభివృద్ధి, రద్దీ నిర్వహణ, తాత్కాలిక సదుపాయాల ఏర్పాటు వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ 2015 నాటి పుష్కరాల నివేదికల ఆధారంగా 2027 పుష్కరాలకు అవసరమైన ప్రతిపాదనలు హేతుబద్ధంగా సిద్ధం చేశారన్నారు. విభాగాల వారీగా ప్రతిపాదనలు, అంచనా ఖర్చులు ఫేజ్-1,ఫేజ్-2 ప్రణాళికలను వెంటనే సమర్పించాలని సూచించారు. భక్తులకు ఎటువంటి ఆటంకం లేకుండా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, పార్కింగ్ వ్యవస్థ ఉండాలన్నారు. రాజమహేంద్రవరం కమిషనర్ రాహుల్ మీనా 2015 పుష్కరాల్లో చేపట్టిన చర్యలు, ఈసారి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమగ్ర పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. సమావేశంలో జేసీ వై.మేఘాస్వరూప్, డీఆర్‌వో టి.సీతారామమూర్తి, అదనపు ఎస్పీ మురళీకృష్ణ, ఆర్డీవోలు రాణిసుస్మిత,ఆర్.కృష్ణనాయక్, జిల్లా అధికారులు కె.గోపినాథ్, ఎస్ఈ తిలక్ కుమార్ జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సూచనలు

రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే అదిరెడ్డి శ్రీని వాస్ మాట్లాడుతూ రియల్ టైమ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అమలు చేయాలన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రా సుగర్స్, ఏపీ పేపరు మిల్లు కాలుష్య నియంత్రణ చర్యలు వేగవంతం చేయాలని చెప్పారు.కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొవ్వూరు స్టేషన్‌లో ప్రధాన రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ఘాట్లు, రహదారులు, మంచినీటి సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ శానిటేషన్ సిబ్బందికి గౌరవభత్యం ఇవ్వాలని, మురుగనీటి పారుదల వ్యవస్థను సజావుగా నిర్వహించాలన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల్లో చేపట్టాల్సిన పనులనుసమగ్రంగా ప్రతిపాదించాలన్నారు. పుష్కరాల నాటికి సన్నద్ధం కావాలన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో అంతా ఆన్‌లైన్

అన్నవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో సేవలన్నింటికీ ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు పొందవచ్చని ఈవో వీర్ల సుబ్బారావు తెలిపారు. వ్రతం టిక్కెట్లు, వసతి గదులు, దర్శనాలు, ప్రసాదాల కొనుగోలు వీటన్నింటికీ దేవదాయశాఖ సూచనలతో ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చామన్నారు. భక్తులు ఆన్‌లైన్ టిక్కెట్లను ఏపీటెంపుల్స్.ఓఆర్‌జీ వెబ్‌సైట్ లేదా మనమిత్ర వాట్సప్ నెంబరు 9552300009 ద్వారా బుక్‌చేసుకోవచ్చన్నారు.

పోషకాలను.. అమ్మేస్తున్నారు!



రేషన్ బియ్యం..తింటే ఆరోగ్యం

- ఎన్నెన్నో పోషకాలు
- ప్రత్యేకంగా సర్కారు తయారీ
- ప్రాసెసింగ్‌కే కేజీ రూ.50
- రూ.20కే అమ్మేస్తున్న వైనం
- నేటికీ పక్కదారి పడుతున్న రైస్

రాజమహేంద్రవరానికి చెందిన సత్యనారాయణకు సుగర్ వ్యాధి ఉంది.. పరీక్షిస్తే 400 పైనే ఉంటుంది. దీంతో భయపడిన అతను ప్రతి రోజూ పరీక్ష చేయించుకున్నా తగ్గేది కాదు.. డాక్టర్‌ను సంప్రదిస్తే.. బియ్యం మార్చాలని సూచించాడు. ఏం చేద్దామా అని ఎక్కడో విని రేషన్ బియ్యం వాడకం ఆరంభించాడు.. అంతే సుగర్ అమాంతం తగ్గింది.. నాటి నుంచి రేషన్ బియ్యమే వాడుతున్నాడు..

కొవ్వూరుకు చెందిన సత్యవతి.. గతంలో రేషన్ బియ్యం విక్రయించేసి సన్నబియ్యం కొనుగోలు చేసుకుంటుంది. అవే తింటుంది.. ఇటీవల రేషన్ బియ్యంలో పోషకాలు ఎక్కువని చెప్పడంతో ప్రస్తుతం రేషన్ బియ్యమే వినియోగిస్తుంది.. రేషన్ బియ్యం వాడిన తరువాత నీరసం తగ్గిందని చెప్పడం గమనార్హం.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రేషన్ బియ్యంలో ఉన్న పోషక విలువలపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో ఇష్టానుసారం విక్రయించేస్తున్నారు. జిల్లాలో 5.63 లక్షల మంది రేషన్ కార్డుదారులు ఉండగా నెలకు సుమారు 8 వేల టన్నుల బియ్యాన్ని అందిస్తున్నారు. ఇందులో సగానికి పైగా బ్లాక్ మార్కె ట్‌కి తరలిపోతున్నాయి.పేదల బియ్యం విక్రయించడం నేరమైనా రేషన్ డీలర్లు ఆ వక్ర మార్గాన్ని వీడడం లేదు. విజిలెన్స్‌లో సిబ్బంది కొరత అక్రమార్కులకు వరంగా మారింది.ఇప్పుడు ప్రభుత్వం అక్కడికక్కడే పరీక్షించే విధంగా టెస్టింగ్ కిట్లు పంపింది.ఇవి ఎంత వరకూ ఫలితాన్నిస్తాయో చూడాల్సిందే.

ఎన్నెన్నో ఆరోగ్య పోషకాలు

గతంలో రేషన్ బియ్యం ముతగ్గా.. రాళ్లు, బెడ్డలతో ఉండేవి. అందువల్ల వాటిని తినడానికి ఇష్టపడేవాళ్లు కాదు. కానీ ఇప్పుడు ప్రభుత్వం నాణ్యమైన బియ్యాన్ని ఇస్తోంది. వీటిని లబ్ధిదారులకు ఉచితంగా ఇవ్వడానికి ప్రభుత్వం కిలోకి రూ.46 భరిస్తోంది. అంటే కిలో రేషన్ బియ్యం రవాణా, నిర్వహణ చార్జీలతో కలిపి రూ.50 అవుతుంది.బియ్యంలో నూక, రాళ్ల వంటి వాటిని నివారించడానికి సార్టెక్స్ మిషన్లను వాడుతోంది. దీంతో గతంలో 25 శాతం నూక ఉంటే ఇప్పుడు 15 శాతం, పాడైన, రంగు మారిన బియ్యం 3 శాతం నుంచి 1.5 శాతానికి పరిమితమయ్యాయి.ఆరోగ్యపరంగా మేలు చేయడానికి మైక్రో న్యూట్రియంట్స్ కలిగిన కెర్నెల్స్‌ని కలుపుతున్నారు.రేషన్ బియ్యంలో బాగా తెల్లగా కనబడేవి ఇవే. పిల్లలు, మహిళ ల్లో రక్తహీనతకు చెక్ పెట్టడానికి ఐరన్, నరాలు, మెదడు చురుగ్గా పనిచేయడానికి, రక్తం తయారు కావడానికి విటమిన్ బి 12, మహిళల ఆరోగ్యానికి ఫోలిక్ యాసిడ్ వంటి వాటితో కూడినవి ఈ కెర్నెల్స్. వీటిని ప్లాస్టిక్ బియ్యం అనే అపోహలో జనం ఉండిపోయారు.వీటిపై అవగాహన కల్పించడంలో ఆ శాఖలు విఫలమవుతున్నాయి. దీంతో రేషన్ బియ్యం కిలో రూ.20లకు దుకాణం వద్ద విక్రయించేసి సొమ్ము చేసుకుంటున్నారు.ఎంత లాస్ అన్నది ఆలోచించడంలేదు.

189 కేసులు..49 టన్నుల రైస్ సీజ్

వైసీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనాలు రేషన్ బియ్యం అవినీతికి కేంద్ర బిందువులుగా మారడంతో కూటమి ప్రభుత్వం ఆ వాహనాలను తొలగించింది. కూటమి ప్రభుత్వం పేదల బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే దిశగా ర్యాపిడ్ కిట్‌లను రంగంలోకి దింపింది. ఈ కిట్లలో పొటాషియం థయోసైనైడ్, హైడ్రోక్లోరిక్ యాసిడ్ సీసాలు ఉంటాయి. ఈ ద్రావణాలను బియ్యంపై స్ప్రే చేస్తే.. ఒకవేళ రేషన్ బియ్యం ఉంటే ఎరుపు రంగులోకి మారిపోతాయి. జిల్లాలోని ఏడుగురు డీటీలు, ఇద్దరు ఏఎస్‌వోలకు వీటిని ఇచ్చారు. రేషన్ బియ్యం అక్రమాల విషయంలో తూర్పు గోదావరిలో ఈ ఏడాది ఇప్పటి వరకూ పౌర సరఫరాల శాఖ 106 కేసులు పెట్టి 31 టన్నుల బియ్యాన్ని సీజ్ చేసింది. విజిలెన్స్ 83 కేసులు పెట్టి 18 టన్నులు స్వాధీనం చేసుకొంది. విజిలెన్స్, రెవెన్యూ, పౌర సరఫరాలు, పోలీసులు రేషన్ బియ్యంపై తనిఖీలు తూతూమంత్రంగా చేయడంతో మూడుపువ్వులు ఆరు కాయలుగా రేషన్ బియ్యం అక్రమాలు సాగుతున్నాయి. రేషన్ షాపుల నుంచి బ్లాక్ మార్కెట్‌కి వెళుతున్నవి మళ్లీ పాలిష్ చేసి సన్నాలుగా బహిరంగ మార్కెట్‌లోకి వివిధ పేర్లతో ప్రత్యక్షమవుతున్నాయి. వీటిని రూ.60కి జనం కొను గోలు చేస్తున్నారు.ఇక విదేశాలకు భారీ ఎత్తున తరలిపోవడం వైసీపీ ప్రభుత్వ హయాం లో వ్యవస్థీకృతమైపోయింది.ఒక్క షిప్ గమ్యానికి చేరితే కోట్లలో ఆదాయం సమకూరుతుంది.

అదరగొట్టిన రాక్ స్టార్ డాన్సులు

బిక్కవోలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యస్వామి వారి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి షష్ఠి కళావేదికపై విశాఖకు చెందిన రాక్‌స్టార్లు డ్యాన్సులతో అదరగొట్టారు. దీనిలో భాగంగా యువతీ, యువకులు ప్రదర్శించిన డ్యాన్స్‌లు అందర్నీ అలరించాయి. శ్రీఆంజనేయం, లాజర్ డ్యాన్సులతో ప్రేక్షకులను కనువిందు చేశారు. పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

సుందరేశ్వరస్వామి హుండీ లెక్కింపు



గోష్పాదక్షేత్రంలో హుండీని లెక్కిస్తున్న అధికారులు

కొవ్వూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వేంచేసియున్న శ్రీబాలాత్రిపురసుందరీ సమేత సుందరేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. దేవాదాయశాఖ తాడేపల్లిగూడెం ఇన్‌స్పెక్టర్ బీ.లక్ష్మీనరసింహారావు (బాలు) ఆధ్వర్యంలో అర్చకులు, భక్తుల సమక్షంలో ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. 2025 జూలై 26వ తేదీ నుంచి నవంబరు 29 వరకు రూ. 72,860 ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మానేపల్లి శ్రీనివాసశాస్త్రి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

రిఫరీగా పీఈటీ సురేష్

కొవ్వూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో జరుగుతున్న బీచ్ వాలీబాల్ పోటీలకు రిఫరీగా కుమారదేవం జడ్పీ హైస్కూల్ పీఈటీ రాపాక సురేష్ వ్యవహరిస్తున్నారు. ఈనెల 26వ తేదీ నుంచి డిసెంబరు 1 వరకు ఉదయపూర్‌లో 5వ కేల్ ఇండియా యూనివర్సిటీ బీచ్ వాలీబాల్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీలకు రిఫరీగా రాష్ట్రం నుంచి పీఈటీ సురేష్ నామినేట్ అయ్యారు. శనివారం గోవా, ఎస్ఆర్ఎం చెన్నై మధ్య జరిగిన మ్యాచ్‌కు సురేష్ రిఫరీగా వ్యవహరించారు.

దివ్యాంగ బాలికకు వీల్‌చైర్ పంపిణీ



వీల్‌చైర్ పంపిణీ చేస్తున్న దేవోక్తి చారిటబుల్ ట్రస్టు సభ్యులు

కొవ్వూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగత్వం కలిగి నడవలేకపోతున్న బాలికకు శనివారం వీల్‌చైర్ పంపిణీ చేశారు. చిడిపికి చెందిన దేవోక్తి చారిటబుల్ ట్రస్టు సభ్యులు పట్టణానికి చెందిన బాలిక రుద్రవేణికి బహూకరించారు. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ పత్తిపాటి నాగరాజు మాట్లాడుతూ ఆపన్నులకు సహాయ సహకారాలు అందించడానికి దేవోక్తి చారిటబుల్ ట్రస్టు ఎప్పుడూ సన్నద్ధంగా ఉంటుందన్నారు. ఇప్పటివరకు 250 మందికి ఆర్టిఫీషియల్ లింబ్స్ ఉచితంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో దేవోక్తి సభ్యులు జోడాల వెంకట్, వీటీవిల్సన్‌రాజు, వైకే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రైతులంతా అప్రమత్తంగా ఉండాలి



యర్నగూడెంలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

దేవరపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులంతా అప్రమత్తంగా ఉండి కల్లాల్లోని ధాన్యానికి బరకాలు కప్పుకోవడం, గోడౌన్లకు తరలించటం, ఆరిన ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలించాలని తహశీల్దార్ ఎం.శ్రీనివాస్, ఏవో కమలరాజు సూచించారు. యర్నగూడెం, త్యాజంపూడి, గౌరీపట్నం, దుద్దుకూరులో ధాన్యాన్ని రహదారి సర్వీస్ రోడ్డుల్లో ఆరబెట్టిన రైతులతో ఏవో మాట్లాడారు.

క్రీడాసామగ్రి అందజేత



యర్నగూడెం హైస్కూల్ విద్యార్థులకు అందజేస్తున్న దాత దొరబాబు

దేవరపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): యర్నగూడెం బొల్లిన గంగరాజు జడ్పీహైస్కూల్ విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ఎండపల్లి దొరబాబు రూ.15 వేలు విలువ గల క్రీడాసామగ్రిని వ్యాయామ ఉపాధ్యాయుడు ఎల్.బుజ్జిబాబుకి శనివారం అందజేశారు. స్కూల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బొంతా సోమరాజు మాట్లాడుతూ దాతల సహకారంతో హైస్కూల్ మరింత అభివృద్ధి చెందుతోందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రరావు, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, సురేశ్‌బాబు, పతాంజలి, వ్యాయామ ఉపాధ్యాయులు కల్లేపల్లి మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

అర్హత గల ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



పశివేదలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతీ రైతుకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ లబ్ధి అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం పశివేదలలో రైతన్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకం ప్రయోజనాలు, లబ్ధి గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదాత క్షేమమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బేతిననారాయణ, సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామచంద్రరావు, సూరపనేని చిన్ని, గారపాటి శ్రీనివాసరావు, పరిమి మురళీ గణేష్, తుంపల్లి ఆదినారాయణ, సూదిన శ్రీనివాస్, రాయపాటి సుబ్బారావు, రైతులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అండ

పేద ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శనివారం నలుగురికి రూ.2,24,299 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కొవ్వూరు మండలం పశివేదలకు చెందిన కె.ఆనంద్‌పాల్‌కి రూ.37,878లు, దేవరకొండ సంతోష్ కుమార్‌కి రూ.46,365లు, పట్టణంలోని శ్రీరామకాలనీకి చెందిన నల్లా ఆదినారాయణకు రూ. 1,20,056, మద్దిపట్లవారి వీధికి చెందిన రూ. ప్రత్తి మణికంట స్వామికి రూ.20,000 విలువైన చెక్కులను అందజేశారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, బేతిన నారాయణ, టీవీ ముత్యాలరావు, సిద్దా దుర్గాప్రసాద్, తుంపల్లి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కాకర్ల నారాయుడు

కొవ్వూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి, మద్దూరు, సీతంపేటలో అర్హత కలిగిన లబ్ధిదారులకు వారి గ్రామాల్లోనే ఇళ్ల స్థలాలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) తెలిపారు. కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో వివిధ ప్రభుత్వశాఖల అధికారులు తమ శాఖల వారీగా జరుగుతున్న ప్రగతి గురించి వివరించారు. తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వాడపల్లి, మద్దూరు, సీతంపేట గ్రామాలకు చెందిన 506 మందికి గత వైసీపీ ప్రభుత్వంలో పశివేదల రోడ్‌లో కొవ్వూరు పట్టణ లేఅవుట్ 3ను ఆనుకుని సెంటు చొప్పన ఇళ్ల స్థలాలు అందించారు. అయితే 3 గ్రామాల ప్రజలు గత 6 ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం గ్రామాలు విడిచి కొవ్వూరు రావడానికి విముఖత చూపిస్తున్నారు. ఇంటి స్థలాలకు సేకరించిన స్థలాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బీసీ హాస్టల్ నిర్మాణాలకు కేటాయించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారన్నారు. 3 గ్రామాల ఇళ్ల స్థలాల లబ్ధిదారులు తమకు ఇచ్చిన పట్టాలను వెనక్కి తిరిగి ఇచ్చి వేసి విముఖత పత్రాలను సమర్పించినట్లయితే ప్రభుత్వ నిబంధనలను అనుసరించి లబ్ధిదారులకు గతంలో ఇచ్చిన పట్టాలను రద్దుచేసి, ప్రస్తుత నిబంధనలు జీవో నంబర్ 23 ప్రకారం వారి గ్రామాలలోనే 3 సెంట్లు చొప్పన ఇళ్ల స్థలాలు అందించడానికి అవసరమైన భూసేకరణకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని సుమారు రూ. 30 కోట్లతో డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేశామన్నారు. అదేవిధంగా తాగునీటి పైపులైను మరమ్మతులకు ప్రణాళికలు అందించామన్నారు. ఏజీఆర్‌బీ అధికారులు మాట్లాడుతూ కొవ్వూరు పట్టణ, మండలంలో 39 గోదావరి స్నానఘట్టాల అభివృద్ధికి రూ. 123 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో టీబీవీ రమణ, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు, మేకల శ్రీను, యలమర్తి శ్రీరాంప్రసాద్, నాయుడు వీర్రాజు, ఎరుబండి సురేష్, తాతారావు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ నిధుల దుర్వినియోగంపై విచారణకు ఆదేశం

ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ

కొవ్వూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మున్సిపాల్టీలో 2015-16 ఆర్థిక సంవత్సరంలో రోడ్డు మార్జిన్, డైలీ మార్కెట్, వీక్లీ మార్కెట్ ఆశీల వేలంపాటలో మున్సిపల్ నిధులకు భారీ నష్టం కలిగించారనే ఆరోపణలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఆయా సంవత్సరాల్లో మున్సిపాల్టీలో పనిచేసిన కమిషనర్ టీ.నాగేంద్రకుమార్, మేనేజర్ బి.శ్రీధర్ (రిటైర్డ్), రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.సాయిబాబు(రిటైర్డ్), జూనియర్ అసిస్టెంట్‌లు యూవీ నూకాంబిక, మీసాల హరనాథ్‌పై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు ఉత్తర్వు అందిన తేదీ నుంచి 15 రోజుల్లో రాతపూర్వకంగా సమాధానం అందించాలని అందులో పేర్కొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల ఎంపికలు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వాలీబాల్ క్రీడాకారులు

కొవ్వూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వాలీబాల్ బాలుర సబ్ జూనియర్స్, జూనియర్, యూత్, సీనియర్ జట్ల జిల్లా స్థాయి ఎంపిక పోటీలు స్థానిక ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో శనివారంతో ముగిశాయి. మొత్తం అన్ని విభాగాలకు సంబంధించి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో టీముకి 16 మందిని ఎంపికచేశారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్, జనవరి నెలల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి జీ.రాఘవేంద్రరావు, గౌతమీ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పరిమి హరిచరణ్, సూరపనేని చిన్ని, కొయ్యల ప్రసాద్, ఇస్మాయిల్, డి.సత్యనారాయణ, వి.విజయ్, రాయుడు, సూర్యచంద్రం, పీడీలు కోడి రామ్‌కుమార్, బి.సతీష్, జె.సురేష్, ఇ.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లో... విద్యాదానం గొప్పది / జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు



గణిత సీనియర్ లెక్చరర్ సత్యనారాయణ (ఎస్ఎస్ఎన్) దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

నల్లజర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాల్లో కంటే విద్యాదానం గొప్పదని జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు అన్నారు. శనివారం నల్లజర్ల ఎస్ఆర్‌కే కోఆపరేటివ్ కళాశాలలో ఇప్పటి వరకు పని చేసిన సీనియర్ గణిత శాస్త్రం లెక్చరర్ నాగిరెడ్డి సత్యనారాయణ (ఎస్ఎస్ఎన్) పదవీ విరమణ కార్యక్రమం శనివారం కళాశాలలో ఛైర్మన్ వసుంధరాదేవి ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు ఎస్ఎస్ఎన్ దంపతులను సెంటర్ నుంచి కళాశాల వరకు మేళతాళాలతో భారీ ర్యాలీగా తీసుకుని వచ్చారు. జడ్పీ మాజీ ఛైర్మన్ బాపిరాజు దంపతులను ఘనంగా సత్కరించారు. బాపిరాజు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా లెక్చరల్ వృత్తిలో ఉంటే అనేక మందిని ప్రయోజకులను చేసిన ఘనత ఎస్ఎస్ఎన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ సుంకర సుబ్బారావు, దొరయ్య, కొడాలి ఆంజనేయ చౌదరి, కొఠారి గాంధీ, వేగి గాంధీ, కోరా కన్నయ్య, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నెలటూరులో రైతన్న మీకోసం కార్యక్రమం



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, కూటమి నాయకులు

చాగల్లు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రోత్సాహకాల వల్ల రైతులు వ్యవసాయం పట్ల సానుకూలంగా ఉన్నారని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మునికోటి శ్రీనివాసరావు అన్నారు. శనివారం నెలటూరులో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్త సీహెచ్ నరసింహారావుతో కలిసి అధికారులు, కూటమి నాయకులు రైతులను కలిసి రైతు భరోసా, పీఎం కిసాన్ సహా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. అనంతరం వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు తాళ్లూరి ప్రసాద్ మాట్లాడుతూ రైతులకు ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే నగదు చెల్లించడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం. మెరికమ్మ, ఎంపీడీవో ఆర్. శ్రీదేవి, కూటమి నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు, కోడూరి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 14న నల్లజర్లలో క్రిస్మస్ సభ

నల్లజర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నల్లజర్లలో వచ్చేనెల 14 తేదీన నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు ఆధ్వర్యంలో నిర్వహించే క్రిస్మస్ సభకు క్రైస్తవ విశ్వాసులు, పాస్టర్లంతా తరలి రావాలని మండల పాస్టర్ల సంఘం పిలుపునిచ్చింది. శనివారం సభ జరుగు ప్రదేశాన్ని వారంతా పరిశీలించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు



వేలివెన్నులో రైతులకు కరపత్రాలు అందజేస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. శనివారం వేలివెన్నులో రైతన్న మీకోసం కార్యక్రమంలో ఇంటింటా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతులకు అవసరమైన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కరపత్రాల ద్వారా ఇంటింటా అధికారులు అందజేస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో వీఎస్ రామారావు, ఏవో బీ. రాజారావు, టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. శనివారం వేలివెన్నులో నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాలకు చెందిన 37 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.15.68 లక్షల విలువైన చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండల టీడీపీ అధ్యక్షులు వెలగన సూర్యారావు, సింహాద్రి రామకృష్ణ, అతికాల రామకృష్ణ, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వేలివెన్నులో పార్టీ గ్రీవెన్స్..

మండలంలోని వేలివెన్నులో మాజీ ఎమ్మెల్యే, బూరుగుపల్లి శేషారావు పార్టీ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలపై వచ్చిన వినతి పత్రాలను శేషారావు అందుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని శేషారావు చెప్పారు. మండల టీడీపీ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, వివిధ గ్రామాల నుంచి వచ్చిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తుఫాన్ ప్రకటనతో రైతుల్లో గుబులు



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

గోపాలపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వరుస తుఫాన్ ప్రకటనలు ఇటు పొగాకు అటు వరి రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఒక పక్క ముమ్మరంగా వరి కోతలు, అటు పొగాకు నాట్ల పనిలో రైతులు, వ్యవసాయ కూలీలు బిజీగా ఉన్నారు. కాగా, ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా ఈ ప్రాంతంలో పొగాకు నాట్లు బాగా ఆలస్యమయ్యాయి. అలాగే పంటకు వచ్చిన వరిచేలు కోతకు సిద్ధంగా ఉన్నాయి. ఈ క్రమంలో మళ్లీ తుఫాన్ ప్రకటనతో రైతుల్లో గుబులు నెలకొంది. ఈ దశలో వర్షాలు పడితే అన్నివిధాలా నష్టపోతామని ఈ ప్రాంత రైతాంగం వాపోతోంది.

గంగారత్నం మృతికి పలువురి సంతాపం



చాగల్లులో గంగారత్నం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

చాగల్లు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చాగల్లు పట్టణ టీడీపీ అధ్యక్షుడు దొంగ రామకృష్ణ తల్లి గంగారత్నం మృతి కారణంగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా గంగారత్నం చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈయనతోపాటు ఏఎంసీ ఛైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సూరపనేని చిన్ని, సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివ నాగేంద్ర, తదితరులు ఉన్నారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి : ఎంపీపీ



రిటైర్డ్ ఎంఈవోను సత్కరిస్తున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు

దేవరపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా తన పదవీ కాలంలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. ఎంఈవోగా విధులు నిర్వహించిన ఎం.తిరుమలదాసు పదవీ విరమణ సన్మాన సభ దేవరపల్లి కరుటూరి ఫంక్షన్ హాలులో శనివారం జరిగింది. ఈ సందర్భంగా తిరుమలదాసు మాట్లాడుతూ 36 సంవత్సరాల క్రితం ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరానని తెలిపారు. అనంతరం ఎంపీపీ కేవీకే దుర్గారావు, టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు ఆయన్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు, ఎంపీడీవో సీహెచ్ నాగార్జునరావు, తహశీల్దార్ శ్రీనివాస్, టీడీపీ నేతలు గన్నమని హరికృష్ణ, ముళ్లపూడి దొరాజీచౌదరి, సొసైటీ ఛైర్మన్ ఉప్పులూరి రామారావు, మండల వైసీపీ కూచిపూడి సతీశ్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ గన్నమని జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులతోపాటు రుణసౌకర్యం

● గోపాలపురం సొసైటీ ఛైర్మన్ రమేశ్‌బాబు

గోపాలపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ సాగులో రైతులకు అవసరమైన ఎరువులతోపాటు రుణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు గోపాలపురం సొసైటీ ఛైర్మన్ వడ్లమూడి రమేశ్‌బాబు తెలిపారు. స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్‌లో (సొసైటీ) వద్ద అర్హులైన ముగ్గురు లబ్ధిదారులకు రైతునేస్తంలో భాగంగా రూ. 12 లక్షల 80 వేలు మంజూరు పత్రాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అత్యధిక గ్రామాలకు గోపాలపురం సొసైటీ సేవలందిస్తోందన్నారు. సుమారు 15 పంచాయతీలు ఈ సొసైటీ పరిధిలో సేవలందిస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఈ సొసైటీ నంచి రైతులకు ఎటువంటి సేవలు అందించకపోవడంతో రైతులు నిస్తేజంలో ఉన్నారని తెలిపారు. వ్యవసాయ సాగులో వారికి అవసరమైన ఎరువులతో పాటు రుణసౌకర్యాన్ని కలిగించినప్పుడే సొసైటీ ద్వారా రైతులకు చేయుతనిచ్చినట్లు అవుతుందన్నారు. స్థానిక శాసన సభ్యులు మద్దిపాటి వెంకట్రాజు సహాయ సహకరాలతో గడిచిన మూడునెలల కాలంలో సుమారు కోటి రూపాయల ఎరువుల వ్యాపారం సాగించామన్నారు. రైతులకు ఎళ్లవేళలా సొసైటీ ద్వారా సేవలందించేందుకు ఆయన సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. సొసైటీలు అందించే సేవలను రైతులు సద్వినియోగం చేసుకుని వ్యవసాయ సాగులో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు ముత్యాల రాయుడు, రాంబాబు, టీడీపీ నాయకులు జ్యేష్ట శ్రీధర్, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోషక ఆహారాన్ని భుజించాలి

● జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు



విద్యార్థులు తయారు చేసిన వంటకాలను పరిశీలిస్తున్న డీఈవో వాసుదేవరావు

ఉండ్రాజవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హైస్కూల్‌లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల వంటకాలను ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా విద్యాశాఖాధికారి కే. వాసుదేవరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పోషక విలువ కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థులు వంటల తయారీలో తల్లులకు సహకరించాలన్నారు. మంచి వంటకాలను తయారు చేశారని డీఈవో ప్రశంసించారు. తొలుత ఫుడ్ ఫెస్టివల్‌ను ఆయన ప్రారంభించారు. తర్వాత పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, విద్యాశాఖ అసిసెంట్ డైరెక్టర్ వి.వెంకట్రాజు, ఎంఈవోలు సక్సేనరాజు, శారదజ్యోత్స్న, ప్రధానోపాధ్యాయుడు పి. రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు లోక్ అదాలత్‌లో 190 క్రిమినల్ కేసులు రాజీ



సమావేశంలో మాట్లాడుతున్న కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి అనురాధ

కొవ్వూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ముందస్తు లోక్ అదాలత్‌లో 190 క్రిమినల్ కేసులను రాజీమార్గంలో పరిష్కరించినట్టు కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనురాధ తెలిపారు. శనివారం కొవ్వూరు కోర్టు ప్రాం గణంలో డిసెంబర్ 13వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ నిమిత్తం కక్షిదారులతో సమావేశం నిర్వహించి, లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీపడదగ్గ సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చునన్నారు. కేసులు రాజీ చేసుకోవడం వల్ల సమయం, డబ్బు రెండూ ఆదా అవుతాయన్నారు. సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జీ.సాయికృష్ణ, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.నాగలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వర్రే మురళి, కొవ్వూరు పట్టణ సీఐ పీ.విశ్వం, కోర్టు, పోలీసు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులను వినియోగించాలి

బిక్కవోలు, నవంబరు 29 (ఆంధ్రజోతి): రసాయనిక ఎరువులు వాడకం మాని, సేంద్రియ ఎరువులను వినియోగించుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్ రైతులకు సూచించారు. ఇళ్లపల్లిలో శనివారం నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొని రైతుల ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పడాల వెంకటరామారెడ్డి, ఏఎంసీ ఛైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, కూటమి నేతలు తనుకు శ్రీధర్, పంచికట్ల నాగరాజు, చెల్లే జోష్‌బాబు, అనుసూరి సుబ్బారావు, తహశీల్దార్ సత్యకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.